07 . 12. 2025

# వెలుతురు

VELTHURU TELUGU DAILY

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 187 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేసి

# నల్గొండ జిల్లాకు నీరు అందిస్తాం



*గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను పండబెట్టారని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్‌ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో రూ.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.*

- కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం
- ప్రజలను పట్టించుకోకుండా నిరంకుశంగా కెసిఆర్ పాలన
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు
- దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం
- పేదలకు 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశాం
- దేవరకొండ సభలో సిఎం రేవంత్



**దేవరకొండ,డిసెంబరు6 వెలుతురు:** పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ. నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఆకలి తీర్చినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని మన ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గుజరాత్ సహా దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్న బియ్యం ఇవ్వట్లేదు. యూపీఏ ప్రభుత్వ హయాములో రాష్ట్రంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగింది. గత పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో కేసీఆర్ చెప్పాలి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 4.50లక్షల ఇళ్లు పేదలకు మంజూరు చేశాం. లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందే ఇందిరమ్మ ప్రభుత్వం.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 25లక్షల మంది రైతులకు

## గతంలో ఎవిరనైనా దగ్గరకు రానిచ్చావా కెసిఆర్?

- ఇప్పుడేమో సర్పంచ్‌లను, వార్డు మెంబర్లపై ప్రేమ
- పదేళ్లు దోచుకున్నది చాలదా..మళ్లీ దోచుకుందామనా..
- బిఆర్ఎస్‌కు కెటిఆర్ అతి పెద్ద శత్రువు
- దేవరకొండ సభలో కెసిఆర్‌పై రేవంత్ విమర్శలు



## ప్రపంచంలోనే అతి గొప్ప రాజ్యాంగాన్ని భారత దేశానికి అందించిన మహానుభావుడు బిఆర్. అంబేడ్కర్

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 06:** ప్రపంచంలోనే అతి గొప్ప రాజ్యాంగాన్ని భారత దేశానికి అందించిన మహానుభావుడు అంబేద్కర్ అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కొనియాడారు, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన

- ఏరియల్ సర్వే నిర్వహించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,డిసెంబరు6 వెలుతురు:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఏరియల్ వ్యూ ద్వారా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను

## రూ.1000 కోట్లతో ఓయూ అభివృద్ధి

- కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా ఉస్మానియా
- అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- 10న ఓయూను సందర్శించనున్న సిఎం

## తెలంగాణ భవితకు బాట గ్లోబల్ సమ్మిట్

- రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్శించడమే లక్ష్యం
- విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచాన్ని ఆకర్శిస్తాం
- 8న గవర్నర్ జిష్టుదేవ్ వర్మ ప్రారంభోత్సవం
- మీడియాకు వెల్లడించిన మంత్రుల భట్టి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్,డిసెంబరు6 వెలుతురు:** గ్లోబల్ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్ కు సంబంధించిన సమ్మిట్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సమ్మిట్ ఉపయోగ పడుతుందన్నారు. గ్లోబల్ సమిట్.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించింది, మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ వివరాలను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటిగంటకు గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. మొత్తం 27 సెషన్లు



ఉంటాయన్నారు. తెలంగాణ విజన్ డాక్యుమెంటరీ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తామని చెప్పారు. ఈ మేరకు శనివారం గవర్నర్

## విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు

- ఇక్కడి సామాజిక పరిస్థితులు వేరు కదా
- కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం
- రౌండ్ టేబుల్ సమావేశంలో కెటిఆర్ పిలుపు




**హైదరాబాద్,డిసెంబరు6 వెలుతురు :** ప్రపంచంలోనే అత్యంత కుబేరులు భారతదేశంలో ఉన్నారని, అలాగే అత్యంత పేదరికం కూడా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచమే కుగ్రామం' అనే పేరుతో అమెరికా,

## శ్రీవారి భక్తుల మనోభావాలు

# దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు

- పరకామణి దొంగతనం చిన్నది ఎలా అవుతుంది
- దానిని సెటిల్‌మెంట్ ఎలా చేస్తారు
- జగన్‌కు దేవుడన్నా లెక్కలేకుండా పోయింది
- జగన్ మూలంగా మాఫియాలు తయారయ్యారు
- శాంతిభద్రతలపై రాజీపడేది లేదు
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి,డిసెంబరు6 వెలుతురు:** శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా మాట్లాడే తీరు అంటూ ఫైర్ అయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మండిపడ్డారు. శనివారం అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సీఎం చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో పలు కీలక



## రూ.1000 కోట్లతో ఓయూ అభివృద్ధి

హైదరాబాద్,డిసెంబర్6 **వెలుతురు**:

చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) రూపురేఖలను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా, అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో ఓయూను అభివృద్ధి చేసేందుకు రూ.1000 కోట్లకు పైగా వెచ్చించాలని నిర్ణయించింది. ఈ బృహత్ ప్రణాళిక అమలుపై సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రణాళికలో భాగంగా వర్సిటీలో ప్రపంచస్థాయి పరిశోధనా కేంద్రాలు, మెగా హాస్టళ్లు, హైటెక్ అకడమిక్ బ్లాకులు నిర్మించనున్నారు. వీటితో పాటు సైకిల్, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా సదుపాయాలు, హెల్త్ కేర్ సెంటర్, కన్వెన్షన్ హాల్ వంటి ఆధునిక హంగులను కల్పించనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, ప్రొఫెసర్ల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన డిజైన్ నమూనాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని, వారి సలహాలు స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటు డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓయూ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా చిహ్నాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీలోని చారిత్రక, వారసత్వ కట్టడాలను సంరక్షించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఓయూ అభివృద్ధికి ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ నెల10న తాను ఓయూను సందర్శిస్తానని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు

ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదని హెచ్చరించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారని, అయితే.. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందేనని కేటీఆర్ హెచ్చరిక చేశారు. తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ మీటింగ్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచే పోరాటాన్ని మొదలుపెడదామని పిలుపునిచ్చారు. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దామని.. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని అన్నారు. దీనిపై వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో 92శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారన్నారు. కనీసం పాలకుల్లో చలనమైనా వస్తుందని కేసీఆర్ సాయం చేశారని చెప్పుకొచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా తక్కువగా ఉండేదని, ఇప్పుడు మనది నాలుగు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయితే, చైనాది అరవై ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థని కేటీఆర్ తెలిపారు. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకురాబట్టే ఫలితాలు సాధించిందన్నారు. అన్నింటికీ ముందు.. పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే కారణమన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోనోపోలీ వల్ల ఎలాంటి అనర్థం జరుగుతుందోనన్నారు. ఇండిగో విమానయాన సంస్థ వల్ల ప్రయాణికులకు ఐదు రోజులుగా జరిగిన అసౌకర్యం ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు కొంతమంది చేతుల్లో పెట్టడం వల్ల ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. శ్రమదోపిడీ వల్లే ఇదంతా జరిగిందని మండిపడ్డారు. ఇండిగో ఒత్తిడికి కేంద్రమే తలొగ్గింది తప్ప, ఇండిగో తగ్గలేదన్నారు.కేంద్రం ఐదు రోజుల తర్వాత స్పందించడం వల్ల ఎయిర్ పోర్టులు బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లుగా మారాయన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇండిగో వల్ల జరిగిన అసౌకర్యం మిగతా రంగాలకు విస్తరిస్తుందని, ఇప్పుడు ఏ ఎన్నికలు లేవని, బీఆర్‌టీయూ ఎవరితోనైనా పని చేయొచ్చని వివరించారు. లేబర్ కోడ్‌లు రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకుంటే దేశానికి దిక్సూచి అవుతుందన్నారు. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని పిలుపునిచ్చారు. వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు

## ప్రపంచంలోనే అతి గొప్ప రాజ్యాంగాన్ని భారత దేశానికి అందించిన మహానుభావుడు బిఆర్. అంబేడ్కర్







ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పలువురు దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఏ దేశంలో లేనటువంటి ఎన్నో భిన్న సంస్కృతులు, భాషలు ఉన్న దేశానికి అన్ని వర్గాలకు న్యాయం రాజ్యాంగాన్ని అందించారన్నారు. ఆ రాజ్యాంగం స్ఫూర్తితోనే ప్రస్తుతం భారతదేశం ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా పయనిస్తుందన్నారు. ఆయన చూపిన మార్గంలోనే ప్రస్తుత మోడీ ప్రభుత్వం నడుస్తూ పంచశీల తీర్థాల అభివృద్ధికి, ఆయన ఆశయ సాధనకు పాటుపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ రాజ్యాంగ హక్కులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు దళిత సంఘాల నేతలు. వాగ్మా రే భీమ్రావు జాబ్‌ఆడే దాదాసాహెబ్. కాంత్రావు . రాజు మస్కే. అనిల్ .. శైలేందర్ సుభాష్ .మున్న జోగు రవి తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తాం

రుణమాఫీ చేసింది. ఒకే విడతలో రూ.2లక్షల చొప్పున రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. రుణమాఫీ పేరిట పదేళ్లపాటు రైతులను కేసీఆర్ మోసం చేశారు. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కేసీఆర్ కలిసేవారు కాదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌజ్‌లోకి ఎవ్వరినీ రానివ్వలేదు. కానీ, నిన్న ఇద్దరు సర్పంచ్‌లను కూర్చోబెట్టుకుని మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని చెబుతున్నారు. కేసీఆర్ ఓడిపోయాకే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగింది. సొరంగంలో ప్రమాదం జరిగితే భారత రాష్ట్ర సమితి నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం‘ అని సీఎం అన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తిచేసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంలు, రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్గొండ అని చెప్పుకొచ్చారు. గడీల పాలనను ప్రజలు తరిమికొట్టారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆలోచనే చేయలేదని విమర్శించారు. పేదలందరికీ తమ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని స్పష్టం చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి. ’కేసీఆర్ హయాంలో పేదలకు దొడ్డుబియ్యం ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వట్లేదు. మా హయాంలో సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. యూపీఏ హయాంలో తెలంగాణలో 25 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు తెలంగాణలో 4 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరగుతుంది. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత మాదే. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. పేదలంటే కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. రైతులను కేసీఆర్ మోసం చేశారు’ అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ’మంచిరోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు. పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్?. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే మనల్ని ముంచే రోజులొస్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టింది గుర్తులేదా..? అయిన.. మీ కుమారుడే మీకు పెద్ద గుదిబండ. కేటీఆర్ ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను ప్రజలు బండకేసి కొడుతూనే ఉంటారు. కేసీఆర్ ఓడిపోయాకే ప్రజలకు మంచి జరిగిందని.. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలనూ కలవలేదు. ఫామ్‌హౌస్, ప్రగతి భవన్‌కు ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లనూ కలుస్తున్నారు. యువతకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. భవిష్యత్‌లో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు సభలో పాల్గొన్నారు.

### గతంలో ఎవిరనైనా దగ్గరకు రానిచ్చావా కెసిఆర్?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ కు మీ కొడుకు కేటీఆరే గుదిబండ అని.. కేటీఆర్ ఉన్నంత కాలం బీఆర్ఎస్ ను బొందపెడుతూనే ఉంటారని కెసిఆర్‌ను ఉద్దేశించి సిఎం అన్నారు. దేవరకొండ బహిరంగ సభలో మాట్లాడిన రేవంత్.. ఇద్దరు సర్పంచులను, వార్డు మెంబర్లను కేసీఆర్ పిలిపించుకుని మాట్లాడారని.. గతంలో కేసీఆర్ ఎవరితోనైనా మాట్లాడేవారా అని ప్రశ్నించారు. మళ్లీ మనదే రాజ్యం అంటున్నారని, ఇష్టపిదాకా దోచుకున్నది చాలలేదా కెసిఆర్ అని విమర్శించారు. పదేళ్లలో గడీలు కట్టుకుని ప్రజలకు దూరంగా ఉన్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు కూడా అపాయింట్ మెంట్ ఇవ్వని కేసీఆర్.. ఇపుడు సర్పంచ్ లను,వార్డు మెంబర్లను పిలిచి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఒకప్పుడు కేసీఆర్ ఎంతో ఘనంగా బతికారని.. వాళ్ల ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్ మెంట్ ఇచ్చేవాడు కాదన్నారు...మంత్రులను గేట్ దగ్గరి నుంచే పంపించేవారని చెప్పారు. తాము అధికారం చేపట్టాక నిలువ నీడలేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ ఎవరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని..ఇందిరమ్మ ఇండ్ల కోసం 22500 కోట్ల ఖర్చుచేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పదెకరాల్లో 150 కోటల గడీ కట్టుకున్నారు కానీ..పేదవాడికి ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేదని చెప్పారు. 200యూనిట్ల ఉచిత కరెంట్ ఇవ్వడంతో పేదల ఇంట్లో వెలుగులు నిండాయన్నారు. పేదవాళ్ల పట్ల కేసీఆర్‌కు అభిమానం లేదన్నారు. మంచిరోజులొస్తాయంటున్నారని.. తెలంగాణను పీక్కతిన్న మీ ఆకలి తీరలేదా?. 8లక్షల కోట్ల అప్పులు చేసిన ఆకలి తీరలేదా అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. ఆనాడు చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ప్రజాపాలనలో అడిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో అత్యధిక రేషన్ కార్డులు దేవరకొండలోనే ఉన్నాయని తెలిపారు., కొత్త రేషన్ కార్డులతో పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా చేశామన్నారు. 3కోట్ల తెలంగాణ ప్రజలు సన్నబియ్యం తింటున్నారని చెప్పారు. పేదల ఆకలి తీరినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని అన్నారు.

## శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు

అంశాలపై మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి చిట్‌చాట్ చేశారు. శ్రీవారి పరకామణి దొంగతనం వ్యవహారంపై జగన్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. పరకామణి దొంగతనం చిన్న దొంగతనం అంటూ జగన్ వ్యాఖ్యలు అందరినీ విస్తుగొలిపాయని చెప్పుకొచ్చారు. జగన్‌కు దేవుడన్నా లెక్కలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలన్నా లెక్కలేదని... ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని ధ్వజమెత్తారు. ’జగన్ తన బాబాయి వివేకా హత్యనే సెటిల్ చేసుకుందామని చూశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూశారు.. ఇంతకంటే ఘోరం ఉంటుందా? దొంగతనాన్ని కూడా తప్పు కాదని చెప్పే వాళ్లను ఏమనాలని ఆగ్రహం చెందారు.సెంటిమెంట్ విషయాల్లో కూడా సెటిల్‌మెంట్ అంటూ వ్యాఖ్యాలా.? దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు తిరిగి కట్టాడు కదా...తప్పేముందని జగన్ అత్యంత అనైతికంగా వాదిస్తున్నారు. భక్తులు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. శ్రీవారి ఆలయంలో ప్రతి అంశంలోనూ భక్తుల సెంటిమెంట్ ముడిపడి ఉంటుంది. అలాంటి సున్నిత అంశాలను కూడా సెటిల్‌చేశామని తేలికగా జగన్ మాట్లాడుతున్నారు. భక్తుల ఇచ్చిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్‌మెంట్ ఏంటని అన్నారు. శ్రీవారి హుండీలో చోరీపై జగన్ చేసిన వ్యాఖ్యలపై అన్నివర్గాల ప్రజల్లోనూ తీవ్ర ఆవేదన కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ఆ వ్యాఖ్యలను తప్పుపడుతున్నారు. రూ.72 వేలు అనేది చిన్న దొంగతనమని చెబుతున్నాడు. దేవుడు హుండీలో చోరీ చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా? కోట్ల మంది భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా పరకామణి విషయంలో జగన్ ఇలాంటి వ్యాఖ్యలు ఘోర పాపం కాదా’ అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు.ఏమాత్రం నైతికత లేని వాళ్లే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని మండిపడ్డారు. తిరుమల పరకామణిలో రూ.70వేల చోరీకి రూ.14కోట్ల ఆస్తి రాసిచ్చేందుకు సిద్ధపడ్డారంటే ఇంకెంత సంపాదించి ఉంటారని ప్రశ్నించారు. తితిదేలో దోపిడీ ఏ స్థాయిలో చేశారో దీనిబట్టే అర్థమవుతోందన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. జగన్‌కు దేవుడన్నా, ఏడుకొండల వాడి భక్తుల మనోభావాలు అన్నా, ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని దుయ్యబట్టారు. చుక్క పాలు లేకుండానే నెయ్యి తయారు చేసి దేవుడి ప్రసాదానికి సరఫరా చేసిన ఘనులా వీళ్లు అని సర్వత్రా చర్చ జరుగుతోంది. గతంలో నెల్లూరు, విజయనగరం జిల్లాలు ఎంతో ప్రశాంతంగా ఉండేవి.. వైకాపా హయాంలో నెల్లూరులో కూడా చాపకింద నీరులా మాఫియాను విస్తరింపజేశారు. లేడీడాన్స్ తయారవటం చూసి నాకే ఆశ్చర్యం కలిగింది. లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేశా. శాంతి భద్రతలు అదుపు చేస్తున్నాం. అధికారం చేపట్టిన నాటికీ ఇప్పటికీ చాలా మార్పు వచ్చింది. రాజధానిలో సమస్యలన్నీ పరిష్కారమై అభివృద్ధి జరుగుతుంటే రైతులు, ప్రజలు ఆనందంగా ఉన్నారు. ఇది రాజకీయంగా కొందరు తట్టుకోలేక బాధపడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన హైదరాబాద్ అభివృద్ధిని... నేటి అక్కడి పాలకులూ గుర్తిస్తున్నారు. ఆనాడు వేసిన అభివృద్ధి బీజం ఫలితంగానే కోకాపేటలో ఎకరం భూమి రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది‘ అని సీఎం గుర్తుచేశారు.

## తెలంగాణ భవితకు బాట గ్లోబల్ సమ్మిట్

విష్ణుదేవ్ వర్మను కలిసిన భట్టి సమ్మిట్‌కు ఆహ్వానించారు. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రేవంత్ ప్రసంగిస్తారని చెప్పారు . మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగాలపై చర్చ జరుగుతుందని.. 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుందని తెలిపారు. సెమీకండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుందన్నారు. సాయంత్రం 6గంటలకు సమ్మిట్ ముగుస్తుందన్నారు డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ మళ్లీ ప్రారంభం అవుతుందని భట్టి చెప్పారు. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంద న్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కోరుకునే వారు ఈ సమ్మిట్ లో పాల్గొనవచ్చని చెప్పారు. ఇండిగో విమాన సమస్య ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమైన వాళ్లు రావడానికి ఇబ్బంది ఉంటే వాళ్లకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 27 సెషన్లు ఉంటాయి. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్ణాతులను సమిట్‌కు ఆహ్వానించాం. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారు. ముఖ్యఅతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తాం. ఇలాంటి సమిట్ గతంలో ఎప్పుడూ జరగలేదు‘ అని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ అజెండా ఖరారైంది. సోమ, మంగళవారాల్లో ఫ్యూచర్‌సిటీ వేదికగా ఈ సమిట్ జరగనుంది. అంగరంగ వైభవంగా అంతర్జాతీయ ఆర్థిక సదస్సు నిర్వహణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రెండ్రోజుల సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖులు తరలిరానున్నారు. 8, 9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని ’ఫ్యూచర్ సిటీ’లో 100 ఎకరాల విస్తీర్ణంలో సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి దిగ్గజ పారిశ్రామిక వేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు హాజరు కానుండడంతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో వేదికలు సిద్ధమవుతున్నాయి. 9న సాయంత్రం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్ ఆవిష్కరించనున్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సెషన్‌లో పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా పాల్గొననున్నారు. క్రియేటివ్ సెషన్‌లో రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గునీత్ మోంగా, అనుపమ చోప్రా పాల్గొంటారు.

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన

పరిశీలించారు. రేవంత్ వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఉన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9 వ తేదీల్లో రైజింగ్ గ్లోబల్ సమిట్ జరగనుంది. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడంతో పాటు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచడమే లక్ష్యంగా ఈ సదస్సును తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.

డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటి గంటకు గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించనున్నారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగా లు ఉంటాయి. మొత్తం 27 సెషన్లు ఉంటాయి. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయి.

మధ్యాహ్నం 2.30గంటలకు రేవంత్ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగాలపై చర్చ జరుగుతుంది. 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుంది. సెమీకండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుంది. సాయంత్రం 6గంటలకు సమ్మిట్ ముగుస్తుంది. డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ ప్రారంభం అవుతుంది. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది.

# ప్రయాణికుల డబ్బు వెంటనే వెనక్కి

- ఇండిగో సంక్షోభంతో ధరలు పెంచకుండా చర్యలు
- పరిస్థితిపై పూర్తిస్థాయిలో చర్యలు: రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ,డిసెంబరు6 **వెలుతురు** :

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో విమాన టికెట్ల ధరలు పెంచకూడదని ఆదేశాలు ఇచ్చామని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ పరిస్తితి ఆధారంగా సంస్థలు ధరలు పెంచితే ఊరుకోబోమని అన్నారు. విమాన టిక్కెట్ గరిష్ఠంగా రూ.18వేలు మించొద్దని ఆదేశాలు జారీ చేశారు. టికెట్ ధరలను నాలుగు కేటగిరీలుగా మంత్రిత్వ శాఖ విభిజించారు. 500 కిలోమీటర్లకు ఒక రేటు, 500 నుంచి 1000 కిలో మీటర్లకు ఒక రేటు ఉంటుందని మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఇండిగో విమానాల రద్దు, ప్రయాణికుల అవస్థలపై కేంద్రమంత్రి మాట్లాడారు. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు అందరూ పాటిస్తున్నారు. ప్రత్యేకంగా కమిటీ వేసి విచారణకు ఆదేశించాం. కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ఇండిగో కచ్చితంగా సమాధానం చెప్పాల్సిందేనని అన్నాఉ. మా మంత్రిత్వశాఖ పూర్తి దృష్టి ప్రయాణికులపైనే ఉందన్నారు . ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని



ఆదేశించాం. రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. 24గంటల్లోగా అంటే ఆదివారం రాత్రి 8గంటల్లోపు రీఫండ్ చేయాలని ఇండిగోను ఆదేశించాం అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇండిగో సంక్షోభంతో ప్రయాణికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులందరికీ రేపటిలోగా డబ్బులు రిఫండ్ చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అంశం పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపడుతున్నామని హెచ్చరించారు. కేవలం ఇద్దరే ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ ఉండటంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పుకొచ్చారు. డీజీసీఏ తరపున ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని ప్రస్తావించారు. దీనికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

## అంబేడ్కర్‌కు సిఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్,డిసెంబరు6 ( వెలుతురు):**

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు సిఎం రేవంత్ ఘనంగా నివాళి అర్పించారు. అండేడ్కర్ వర్ధంతి సందర్భంగా.. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు.

# తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్‌కు సాదర ఆహ్వానం

**- ఒడిశా సీఎం ను కలిసి ఆహ్వాన పత్రిక ను అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి**



**వెలుతురు డిసెంబర్ 06, ఒడిశా:**
హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న.. తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్?కు హాజరవ్వాలని.. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ని ప్రత్యేకంగా ఆహ్వానించారు రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. భువనేశ్వర్ లో ఈ రోజు సచివాలయం లో సీఎం మోహన్ చరణ్ మాఝి ని మంత్రి శ్రీహరి కలిశారు. మంత్రి శ్రీహరి ని సాదరంగ ఆహ్వానించి షాలువాతో సత్కరించారు ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి..ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం.. ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఒడిశా ముఖ్యమంత్రి కి అందజేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్యే లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, భవిష్యత్తు లో అనుసరించే ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు మంత్రి వివరించారు. నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు.. వివిధ రంగాల నిపుణుల ఆలోచనల మేరకు తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్?ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి కి వివరించారు. ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి ఆహ్వానించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కి ,స్వయంగా ఒడిశా కి వచ్చి తనకు ఆహ్వానపత్రాన్ని అందచేసిన మంత్రి శ్రీహరి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రి కి జ్ఞాపిక ను అందజేశారు మంత్రి వాకిటి శ్రీహరి.

# పిట్లం గ్రామ అభివృద్ధికై మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించండి

- నవాబ్ సుదర్శన్ గౌడ్



**పిట్లం వెలుతురు డిసెంబర్ 06:**
ఒకసారి అవకాశం ఇవ్వండి పిట్లం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పిట్లం సర్పంచ్ అభ్యర్థి నవాబ్ సుదర్శన్ గౌడ్ అన్నారు. బ్యాలెట్ పేపర్ లోని 4వ నెంబర్ లోని ఫుడ్ బాల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. పిట్లం గ్రామంలో మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తానని.. నిరుద్యోగ ఆడపడుచులకు కుట్టు మిషన్లతో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్, ఎవరైనా నిరుపేద చనిపోతే తక్షణ ఆర్థిక సాయం, నిరుపేద ఆడపడుచులకు పెళ్లి కానుక, స్కూలు పిల్లలకు నోటు పుస్తకాలు, నిరుద్యోగులకు ఉచిత స్టడీ మెటీరియల్ మరియు ఆన్లైన్ కోచింగ్, పరీక్షల సమయంలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తాని సుదర్శన్ గౌడ్ హామీ ఇచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామస్తుల క్షేమం కోసం అన్ని ప్రాంతాల్లో సీసీటీవీల ఏర్పాటు చేస్తన్నన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి పిట్లం సర్పంచ్ గా అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# సాయి ఈశ్వర్ ది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్యనే...

**- కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని బీసీలు గమనించాలి...**

**- బీజేపీ శాసనసభ పక్ష ఉపనేత పాయల్ శంకర్...**



**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కాదనే బెంగతో ప్రాణాలర్పించిన సాయి ఈశ్వర్ ది ఆత్మహత్య కాదని, ముమ్మాటికి అది ప్రభుత్వ హత్య నేనని బిజెపి శాసనసభాపక్ష ఉప నేత పాయల్ శంకర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ పేరుతో చేస్తున్న మోసాన్ని రాష్ట్రంలోని బీసీ లందరూ గమనించాలని ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఊగిసలాడిన మాదిరిగానే బీసీల రిజర్వేషన్ ల విషయంలో సైతం రాష్ట్ర ప్రభుత్వం అదే తీరు అవలంబిస్తుందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను ఆశల పల్లకిలోప్రభుత్వం నాటకాలు ఆడిందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ లు ఇవ్వకపోగా, ఉన్న రిజర్వేషన్లు తగ్గించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం బీసీలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రంలో మరో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతోందన్నారు. ఆనాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంతో బీసీ లు పోరాటాలు, త్యాగాలలో ముందుండి ఎంతోమంది ఆత్మబలిదానాలు చేశారని గుర్తు చేశారు. మళ్ళీ ఇప్పుడు రిజర్వేషన్ ల కోసం బీసీ లు ఆత్మ బలిదానాలు చేసుకోవాలా అని ప్రశ్నించారు. ఆత్మబలిదానం చేసుకున్న సాయి ఈశ్వర్ కుటుంబానికి రూ. 5 కోట్ల నష్టపరిహారం ఇచ్చి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలాన్ని ఇవ్వాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు సుభాష్.దినేష్ మాటోలియా, లాలా మున్నా, ఘటిక క్రాంతి, రఘుపతి, జోగు రవి.భీమ్సేన్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న మక్తల్ నియోజకవర్గం

**- రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గం గా మక్తల్**

**- రెండేళ్ల ప్రజా పాలన సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి**



**మక్తల్ వెలుతురు డిసెంబర్ 06:**
రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మక్తల్ నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక, యువజన సర్వీసులు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. గతంలో ఎన్నడూ లేని విధంగా మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన ముందుకు నడిపిస్తున్నానని తెలిపారు. మక్తల్ నియోజకవర్గం 2023 కన్నా ముందు, 2023 తర్వాత ఎలా ఉందో ప్రజలు గమనించాలన్నారు. మక్తల్ లో ఎన్ టి పి సి ఆధ్వర్యంలో ఎనిమిది వందల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు పరిశీలించవలసిందిగా క్యాబినెట్ నిర్ణయించిందని ఇది సాకారం అయితే ఈ ప్రాంతంలో దాదాపు 4,000 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుందని మంత్రి తెలియజేశారు. సుమారు 5 వేల కోట్ల బడ్జెట్ తో మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. భూ నిర్వాసితులకు 14 లక్షల నుండి మరో ఆరు లక్షలు పెంచి ఎకరానికి 20 లక్షల రూపాయలు ఇస్తున్నామని తెలిపారు దీంతో అదనంగా 57 కోట్ల రూపాయలు రైతులకు లబ్ధి చేకూరిందని స్పష్టం చేశారు. మక్తల్ నారాయణపేట రోడ్డు ను నాలుగు లేన్ ల రోడ్డుగా విస్తరిస్తూ 210 కోట్ల బడ్జెట్ ను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే 250 కోట్ల నిధులతో మక్తల్ నియోజకవర్గంలో అన్ని మౌలిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అనుగొండ ఆర్ అండ్ ఆర్ సెంటర్ నిర్మాణానికి 42 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో 363 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని దీంతో 33,788 మంది రైతులకు లబ్ధి చేకూరిందని మంత్రి తెలియజేశారు. ఖరీఫ్,రబీ కాలంలో కలిపి సుమారు రెండు లక్షల డెబ్బై వేల మెట్రిక్ టన్నుల వడ్లు ప్రభుత్వం కొనుగోలు చేసిందని, దీంతో 619 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు అదనంగా 122 కోట్ల బోనస్ కూడా చెల్లించామని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఒక్క మక్తల్ నియోజకవర్గానికే 12,552 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని దీంతో దాదాపు 60 వేల మంది లబ్ధి పొందారన్నారు. ప్రతీ పేదవాడికి 6కిలోల సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. మక్తల్ పట్టణంలో పది ఎకరాల్లో 150 పడకల ఆసుపత్రి ని మరో ఆరు నెలల్లో ప్రారంభించుకోబోతున్నామని మంత్రి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో 26 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రికి నిధులు మంజూరు చేశామని తెలియజేశారు. మక్తల్ ఆత్మకూరు పట్టణాలలో 6 కోట్లతో నూతన డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు నియోజకవర్గంలో 175 కోట్లతో 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని మంత్రి తెలియజేశారు అలాగే బీటీ రోడ్ల నిర్మాణానికి 221 కోట్లు మరమ్మతులకు 16 కోట్లు మంజూరు చేశామన్నారు. 20 గ్రామపంచాయతీ భవనాలకు, 19 అంగన్వాడి కేంద్రాల భవనాలకు సుమారు 6 కోట్లు మంజూరు చేశామన్నారు. మక్తల్ పట్టణంలో దాదాపు 6 కోట్ల రూపాయలతో మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు మక్తల్ పట్టణంలో కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు వచ్చాయని తాత్కాలిక భవనం కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి లో అగ్రభాగానా మక్తల్ నియోజకవర్గన్ని నిలబెడతానని వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రానున్న మూడేళ్లలో మరిన్ని నిధులు తీసుకువచ్చి రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గం గా తీర్చి దిద్దుతానని మంత్రి తెలిపారు

# గ్లోబల్ సమ్మిట్ ప్రపంచంలో రోల్ మోడల్ గా నిలుస్తుంది

**- అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ**

**- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో సమావేశం నిర్వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**










**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ ప్రపంచంలోనే రోల్ మోడల్ గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి గారు శనివారం నాడు పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల్లో విశేషగుర్తింపు పొందిన దిగ్గజాలను ఆహ్వానించడం జరిగిందన్నారు. గడచిన రెండు సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు 2037 విజన్, 2047 విజన్ ఈ రెండు సెక్టార్లకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను ఈ సమ్మిట్‌లో వివరించబోతున్నాం. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారి సూచనల మేరకు ఈ రోజు సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని, గడువులోగా పూర్తిస్థాయి ఏర్పాట్లకు ముమ్మర చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ ప్రగతి దేశంలో ఉన్న రాష్ట్రాలతో కాదు, ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో ఇందిరమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది .తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. సమ్మిట్‌పై ఇండిగో విమానాల రద్దు ప్రభావం ఏమాత్రం చూపదని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారు దీనిపై ఎప్పటికప్పుడు వచ్చే అతిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశీస్తున్నారని చెప్పారు.

# దేశ వ్యాప్తంగా తెలంగాణ దృష్టిని ఆకర్షించే అడ్లూరి పర్యటన

**- గ్లోబల్ సమ్మిట్‌కు హర్యానా సీఎం , పంజాబ్ ఆర్థిక శాఖ మంత్రినీ స్వయంగా ఆహ్వానించిన మంత్రి**



**హర్యానా, పంజాబ్ వెలుతురు డిసెంబర్ 06**
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025" కు ఆహ్వానాల కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం రోజున హర్యానా మరియు పంజాబ్ రాష్ట్రాలను సందర్శించారు. సమ్మిట్ ప్రాముఖ్యత, తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి పథం, పెట్టుబడుల అవకాశాలు, రాష్ట్రాల మధ్య సహకార వేదిక వంటి కీలక అంశాలపై ఇరురాష్ట్రాల నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని గారిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి, డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వాన పత్రాన్ని అందించారు. రాష్ట్ర పెట్టుబడుల వాతావరణం, TS-iPASS ద్వారా లభిస్తున్న వేగవంతమైన అనుమతులు, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్న విధానం, ఐటీ -ఫార్మా-ఎలక్ట్రానిక్స్ రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న పురోగతిపై ఆయన సీఎం సైనీకి వివరంగా చర్చించారు. తెలంగాణ అభివృద్ధి వేగం, పెట్టుబడులను ఆకర్షించే దూరదృష్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వెలుగు చూస్తున్న కొత్త అవకాశాలను హర్యానా సీఎం ప్రశంసించారు. దేశంలోని రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని కూడా ఇరువురు నాయకులు ప్రస్తావించారు. అలాగే, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విదేశీ పర్యటనలో ఉండటంతో, పంజాబ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హార్పల్ సింగ్ ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కలుసుకుని సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానం అందించారు. పంజాబ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య వ్యవసాయ ప్రాసెసింగ్, అగ్రిటెక్, MSME, స్టార్ట్‌అప్ సహకారాలు, పర్యాటక-సాంస్కృతిక మార్పిడి, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో భాగస్వామ్యం కల్పించే అవకాశాలపై విస్తృత చర్చ జరిగింది. పంజాబ్ తరఫున కూడా తెలంగాణతో కలిసి పనిచేయాలనే ఆసక్తి వ్యక్తం చేయబడింది. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్ర బ్రాండ్ విలువను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం, తెలంగాణ అభివృద్ధి దిశలో నిర్ణయాత్మక అడుగులు వేయడం వంటి లక్ష్యాలతో ఈ సమ్మిట్‌ను ప్రభుత్వం దావోస్ తరహాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. "తెలంగాణ రైజింగ్-2047" దార్శనిక పత్రాన్ని కూడా ఈ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నారు. ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తం గా ప్రముఖులు, CEOలు, టెక్నాలజీ నిపుణులు, విదేశీ ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు సహా దాదాపు 3 వేల మంది పాల్గొననున్నారు. సినీ స్టూడియోలు, పర్యాటకాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ వంటి రంగాల్లో ఈ సమ్మిట్‌లో అనేక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. రాష్ట్ర భవిష్యత్ వికసనానికి, ఆర్థికాభివృద్ధికి, తదుపరి రెండు దశాబ్దాలకు దిశానిర్దేశం చేసే కీలక వేదికగా ఈ సమ్మిట్ నిలవనుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గారు స్పష్టం చేశారు.

# డిసబిలిటీ అవేర్నెస్ వాక్ ను ప్రారంభించి ఆర్థిక సాయం అందించిన పద్మారెడ్డి.




**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన డిసబిలిటీ అవేర్నెస్ వాక్-2025 ను జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, వికలాంగుల హక్కుల వేదిక సలహాదారు సూదిని పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు అభ్యుదయ భారత్ ట్రస్ట్ తరపున చైర్మన్ సూదిని పద్మా రెడ్డి వివిధ వికలాంగుల ఎన్జీవో లకు, కళాకారులకు చెక్కు రూపంలో 50 వేల రూపాయలు విరాళం అందించారు



# సంపాదకీయం.. పాఠాలు నేర్చుకోని కాంగ్రెస్ నేతలు !



అసమర్థ రాజకీయాల వల్ల ప్రజా సమస్యలపై పోరాడడంలో కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టాక రాహుల్ వైఫల్యం చూశాం. ఆయన ఓ రకంగా పారిపోయాడనే చెప్పాలి. దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన అవగాహన లేదు. అందుకే రాహుల్ ఎప్పుడూ విఫల నాయకుడిగానే ఉంటున్నారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఓ ఎజెండా ఉండాలి. కానీ రాహుల్‌కు అలాంటిదేమీ లేదని గత పదేళ్లుగా చూస్తూనే ఉన్నాం. ఓట్ చోరీ, గద్దీ చోడ్ అంటూ నినాదాలు, పార్లమెంట్ సమయాన్ని వృధా చేయడం, పేరుకు ఖర్గేను అధ్యక్షుడిని చేయడం వంటివన్నీ పనిచేయవని గుర్తిచడం లేదు. వంశపారంపర్య రాజకీయాలు చేయడం మానుకోవడం లేదు. వారి ఇంటినుంచే ముగ్గురు ఎంపిలో ఉన్నారు. తల్లీకొడుకు, కూతురు ఎంపిలు. అల్లుడు రాబర్ట్ వాద్రా కూడా రెడీగా ఉన్నాడు. పాదయాత్ర తప్ప రాహుల్ చేసింది, దేశానికి ఒరగబెట్టిందీ ఏమీ లేదు. గత పదేళ్ల యూపిఏ పాపాలను ప్రజల మరచిపోలేదు. మోడీ పాలనను, మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి పార్లమెంట్ మంచి వేదిక. అయితే సమస్యలను ఎండగట్టే ప్రయత్నం చేయకుండా కేవలం..రచ్చ చేయడం ద్వారా మాత్రమే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని చూస్తోంది. అలా చేసి గత ఎన్నికల్లో ఢమాల్ మంది. మరో నాలుగేళ్ల వరకు ఆ అవకాశం లేదు. ఈ లోగా కాంగ్రెస్ అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవడం, ప్రజా సమస్యలపై దీర్ఘకాలిక పోరాటం చేయడం విపక్ష నేతగా రాహుల్ పనిచేయాలి. కర్నాటకలో సిఎం కుర్చీ కోసం కుమ్ములాటలు సాగుతున్నాయి. దీనిని సమర్థంగా పరిష్కరించే ధైర్యం రాహుల్‌కు లేదు. ఎందుకంటే కరవమంటే కప్పకు..విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా కర్నాటక వ్యవహారం ఉంది. రెండున్నరేళ్లు అయ్యింది కనుక డికె శివకుమార్‌కు ఒప్పందం ప్రకారం సిఎం సీటు అప్పగించాలి. దీనిని కూడా సమర్థంగా నిర్వహించలేక పోతున్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ పదవిని ఆశిస్తున్న డీకే శివకుమార్ మధ్య ఇటీవల బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లు జరిగాయి. అయినంత మాత్రాన సమస్య సమిసిపోదు. ఏం చేయాలో కాంగ్రెస్ అధ్యక్షుడు గా ఉన్న కార్నాటక నేత ఖర్గేకే తెలియదు. సమస్యను పరిష్కరించే సత్తా ఖర్గేకు లేదు. ఇంటిపోరునే పరిష్కరించుకోలేని నేతలు బిజెపిపై వేలెత్తి చూపడం ప్రజలు గమనించడం లేదనుకుంటే ఎలా? వీరి సమర్థత ఎలాంటిదో దీనిని బట్టి తెలుసుకోవచ్చు. కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని గాడిన పెట్టేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ హై కమాండ్ సుముఖంగా లేదు. అంతెందుకు శశిథరూర్ లాంటి వారిని కంట్రోల్ చేసుకునే ధైర్యం లేదు. అంతకుమించి రాజకీయ నైపుణ్యం రాహుల్‌కు లేదు. వందిమాగధులు చెప్పింది విని తలూపే రాహుల్‌కు రాజకీయ నాయకత్వ లక్షణాలు అస్సలు లేవు. అందుకే విఫల విపక్షంగా ఉండడం వల్లనే మోడీ ఓ రకంగా నిరంకుశ నేతగా ఎదిగారని చెప్పాలి. పార్టీలో సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకోగల తెగువ, సత్తా పార్టీ నాయకత్వానికి లేవని చెప్పాలి. గత సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ బతికి బట్టకట్టింది. అది కేవలం మోడీపై వ్యతిరేకత కారణంగానే అని చెప్పాలి. ఈ పరిస్థితి కారణంగా రాహుల్‌గాంధీ నాయకత్వం పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని చెప్పడానికి లేదు. సొంత పార్టీ నేతల నుంచి ఆదరాభిమా నాలు కూడా ఇప్పుడు పెద్దగా దక్కడం లేదు. కర్నాటక, తెలంగాణల్లో స్థానిక పరిస్థితులు, స్థానిక నేతల వ్యూహాలే కాంగ్రెస్‌ను గెలిపించగలిగాయి. భారత రాజ్యాంగ ప్రతిని వెళ్లిన ప్రతిచోటా ఎత్తిచూపుతూ జాతి నిర్మాణానికి అంటూ ఆయన నినాదాలను వల్లె వేసినంత మాత్రాన కాంగ్రెస్ బతికి బట్టకట్టడం జరగదు. అనివార్యంగానే నెహ్రూ కుటుంబంపై ఉన్న ఆదరణతో కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ నాయకత్వాన్ని అంగీకరించాయి. కాంగ్రెస్‌కు తిరుగులేని నాయకుడుగా ఆయన ఆవిర్భవించారు. మరి పార్టీపై మరింత పట్టు సాధించేందుకు ఆయన పూనుకున్నారా.. అంటే లేదనే చెప్పాలి. పార్టీ కార్యకలాపాలు అన్నిటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్న దాఖలాలు లేవు. పార్టీ సంస్థాగత వ్యవహారాలను చాలావరకు తన విధేయులకు, మరీ ముఖ్యంగా కేసీ వేణుగోపాల్ లాంటి వరికి అప్పగించారు. ఆయన సూచనల మేరకే కర్నాటకలో మొన్న డికె శివకుమార్, సిద్దరమాయ్యలు పరస్పరం అల్పాహార విందు ఇచ్చుకున్నారు. ఇది చల్లారదని తెలుసు. సీటుకోసం పోటీలో సిద్దరామయ్య పట్టువీడడం లేదు. తనకు న్యాయంగా దక్కాల్సిన సిఎం సీటు దక్కలేదన్న ఆగ్రహంతో డికె ఉన్నారు. కర్ణాటక కాంగ్రెస్‌లోని అంతర్గత సమస్యను గట్టిగా పరిష్కరించలేని నాయకుడు రాహుల్. ఇదే పరిస్థితి రేపు తెలంగాణలో కూడా వస్తుంది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఒకరు, కైవసం చేసుకునేం దుకు మరొకరు కలహించుకుంటుండం అన్నది కాంగ్రెస్ నైజం. ఏ రాష్ట్రంలో అయినా ఇది పరిపాటిగా వస్తుంది. అందుకే కర్నాటక వ్యవహారంల పార్టీ హై కమాండ్ ఆ ఇద్దరినీ పిలిచి సమదుదాయించలేక పోతున్నది.దీనికి కారణం కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో లేకపోవడమే. కాంగ్రెస్ అధికారంలో ఉంటే రాష్ట్రాల్లో రాజకీయాలు నెరపడం సులువు. అటువంటి పరిస్థితులు ఇప్పుడు బొత్తిగా లేవు. అధికారం అన్నది కాంగ్రెస్‌కు చరిత్రగా మారింది. పార్టీలో నాయకుల మధ్య ఘర్షణలను సామరస్య పూర్వకంగా పరిష్కరించగల రాజకీయ సత్తా రాహుల్‌కు లేదు. నాయకత్వ తగాదాలకు పరిష్కారించగలిగే వ్యూహకర్తలు లేరు. గతంలో రాజస్థాన్‌లోనూ, ఛత్తీస్‌గఢ్‌లోనూ ఈ పద్ధతిని అనుసరించేందుకు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పార్టీలో అంతర్గత కలహాలు పెరిగిపోయాయి. ఫలితంగా ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. తాజాగా మితిమీరిన ఆత్మవిశ్వాసంతో బీహార్‌లో ఓటమి చవిచూసింది. ఓట్ చోరీ అని ప్రచారం చేసినా ఫలించలేదు. ప్రజల్లో ఉంటూ పోరాటాలు చేయడం నేర్చుకోవాలి. నినాదాలు కాకుండా విధానాలతో ముందుకు సాగాలి. అప్పుడే కాంగ్రెస్ బతికి బట్టకట్టగలదు.

# ప్రజల స్వరం వినిపించాలంటే చట్టసభలు బతికుండాలి..!



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన క్షణం నుండి ప్రజాస్వామ్యం మా జాతి ఆత్మగా నిలిచిందని చెప్పడంలో అతిశయోక్తి లేదుగానీ, ఆ ప్రజాస్వామ్యాన్ని ఎలా నిర్మించాలి? ఏ పద్ధతిలో నిర్వహించాలి? అనే అత్యంత కీలకమైన ప్రశ్నకు మన రాజ్యాంగ నిర్మాతలు అత్యంత ప్రామాణిక సమాధానం ఇచ్చారు. ఎన్నో రోజుల చర్చలు, విశ్లేషణలు, ప్రపంచంలోని అనేక రాజకీయ వ్యవస్థలను పరిశీలించిన తర్వాత వారు భారతదేశానికి శ్రేష్ఠమైన పాలనా విధానం పార్లమెంటరీ ప్రజాప్రాతినిధ్య వ్యవస్థేనని ఖరారు చేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు చట్టాలను తయారు చేయాలి, వారినుంచే ప్రభుత్వాలు ఏర్పడాలి, ఆ ప్రభుత్వాలు రోజువారీగా శాసనసభలకు జవాబుదారీగా ఉండాలి, ప్రజల సమస్యలపై తెర మీదే చర్చిస్తూ రక్షణ, ఆర్థిక వ్యవస్థ, ప్రజా సేవలు, అభివృద్ధి వంటి ప్రతి అంశం పై పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలి,ఇదే పార్లమెంటరీ ప్రజాస్వామ్య మూలస్తంభం. ప్రజల చేతుల్లో నిర్ణయాధికారం ఉండి, పాలకులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలంటే శాసనసభలు తరచుగా సమావేశమవుతూ, నిశితంగా చర్చిస్తూ, సదస్సుల ద్వారా ప్రభుత్వాల పనితీరును విశ్లేషిస్తూ ఉండాలి. ఈ ఆదర్శంతోనే మన రాజ్యాంగ కర్తలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి జైకొట్టారు.అయితే ఏ వ్యవస్థ అయినా దానిని బలపరచేది దాని ఆచరణ. ఆచరణలో లోపం వస్తే వ్యవస్థ ఎంత బలమైనా క్రమంగా నిరుత్సాహపడి మూలాలను కోల్పోతుంది. ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన రాజకీయ సంక్షోభం చట్టసభలు తమ అసలు లక్ష్యాన్ని కోల్పోతున్నాయనేది చేదు నిజం. లోక్‌సభ, రాజ్యసభ మాత్రమే కాదు, రాష్ట్ర శాసనసభలు కూడా సంవత్సరానికి కొన్ని రోజులు మాత్రమే భేటీ అవుతున్నాయి. సమావేశాలు జరిగినా అవి నిర్మాణాత్మక చర్చల కంటే అప్రసక్త వాగ్వాదాలకు, వ్యూహాత్మక అంతరాయాలకు వేదికవుతున్నాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ప్రశ్నలు అడగాలి, ప్రభుత్వాలు సమాధానాలు ఇవ్వాలి, కమిటీలు పనిచేయాలి, బిల్లులు చర్చించాలి, లోపాలు బయటపడాలి, ప్రజా ప్రయోజనం కాపాడాలి,కాని ఈ ప్రాథమిక ప్రక్రియ ప్రతి ఏడాది కాస్త కాస్త తగ్గిపోతున్నదే కాకుండా, వ్యవస్థ మొత్తం పక్షవాతం పట్టినట్టుగా మారుతోంది.మొదటి లోక్‌సభ సంవత్సరానికి సగటున 135 రోజులు పనిచేసేది. ఆ రోజుల్లో ప్రభుత్వంపై తీవ్రమైన ప్రశ్నలు నమోదయ్యేవి. బిల్లులు గంటల తరబడి చర్చించబడేవి. ప్రతిపక్షం తక్కువైనా తమ వాదనలను బలంగా వినిపించేది, మంత్రులు అందుకు సమాధానం చెప్పాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం 17వ లోక్‌సభకు వచ్చేసరికి ఆ సంఖ్య 55 రోజులకు పడిపోయింది. అంటే సుమారు 60 శాతం క్షీణత. ఇది సంఖ్యలో మాత్రమే తగ్గుదల కాదు, ప్రజాస్వామ్యం యొక్క చైతన్యంలో, ప్రజా పర్యవేక్షణలో, ప్రభుత్వ జవాబుదారీతనంలో వచ్చిన భారీ పతనానికి నిదర్శనం.కేంద్రం మాత్రమే కాదు,రాష్ట్రాలలో పరిస్థితి మరింత దారుణం. ఉత్తరాఖండ్, సిక్కిం వంటి రాష్ట్రాలు ఏడాదికి 12 రోజుల పాటు మాత్రమే అసెంబ్లీ నిర్వహించాయి. హరియాణా, పంజాబ్ వరుసగా 13, 14 రోజులు మాత్రమే పనిచేశాయి. మధ్యప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు 18 రోజులు, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ 19 రోజులు మాత్రమే పనిచేయడం ప్రజాస్వామ్యానికి చీకటి సూచిక. ఈ రాష్ట్రాల్లో ఎన్ని సమస్యలు ఉన్నాయి? రైతుల ఇబ్బందులు, నిరుద్యోగం, ఆరోగ్యం, విద్య, అవినీతి, చట్టసవ్యస్థ పతనం,ఇన్ని ఉన్నప్పటికీ అసెంబ్లీ తలుపులు తెరుచుకునేది కేవలం కొన్ని రోజులే. ఆ కొన్ని రోజుల్లో కూడా చర్చలు సమగ్రంగా జరగవు. ఒకటి రెండు బిల్లులను చర్చించకుండా, అవసరమైన సమయం ఇవ్వకుండా వేగంగా పాస్ చేసి ప్రభుత్వం ముందుకు సాగిపోతుంది.ఇలా చూస్తే చట్టసభల నిజమైన విధి,ప్రభుత్వంపై పర్యవేక్షణ, ప్రజా సమస్యలపై చర్చలు, మొత్తంగా కుంచించుకుపోయింది. దీనిపై దేశవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖ నాయకులు, మాజీ స్పీకర్లు, న్యాయవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభాపతి ఓం బిర్లా కూడా స్పష్టంగా చెప్పారు,పనిదినాలు తగ్గిపోతున్నాయి, అనవసర అంతరాయాలు పెరిగిపోతున్నాయి, సభ్యుల హాజరు సమస్యగా మారింది, సభా క్రమశిక్షణ దెబ్బతింటోంది అని. ఇది చిన్న విషయం కాదు,దేశ భవిష్యత్తుకు సంబంధించిన ప్రమాద సంకేతం.చట్టసభలు సమావేశమవకపోతే ఏమవుతుంది? ప్రభుత్వంపై ఎలాంటి పర్యవేక్షణ ఉండదు. నిర్ణయాలు ఎవరూ ప్రశ్నించకుండా కొనసాగిపోతాయి. ప్రజలకు నష్టం కలిగించే విధానాలు, చట్టాలు, ఒప్పందాలు ప్రతిపక్ష స్వరం లేకుండా ముందుకు సాగుతాయి. ప్రజాప్రతినిధులు ప్రజల మాట మాట్లాడే అవకాశం కోల్పోతారు. ప్రభుత్వ దుర్వినియోగాలు బయటపడవు. సరిదిద్దే చర్యలు ఆలస్యం అవుతాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండాల్సిన “చెక్ అండ్ బ్యాలెన్స్” అన్నదే లేదు. చివరకు ఇది అధికార కేంద్రీకరణకు దారి తీస్తుంది.మరో ముఖ్యమైన సమస్య,చట్టాల ఆమోదం. ఒక బిల్లును ఆమోదించడానికి సాధారణంగా కమిటీల పరిశీలన, నిపుణుల అభిప్రాయాలు, ప్రజా చర్చ, ప్రతిపక్షం సూచనలు వీన్నింటితో కూడిన రాజకీయ ప్రక్రియ అవసరం. కాని ప్రస్తుతం అనేక బిల్లులు నిమిషాల్లో పాస్ అయిపోతున్నాయి. చర్చ లేకుండా, వివరణ లేకుండా, విధానాల ప్రభావంపై సమగ్ర విశ్లేషణ లేకుండా చట్టాలు ఆమోదించబడుతున్నాయి. ఇది ప్రజలకు భారీ ప్రమాదం. చట్టం ఒకసారి పాస్ అయితే కోట్లాది భారతీయుల జీవితాలపై నేరుగా ప్రభావం ఉంటుంది. కాని వాటిపై చట్టసభలు మాట్లాడే సమయం కూడా లేకపోవడం భారతీయ ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత విచారకరమైన పరిణామం.ఇంకాఆందోళనకరమైనవిషయం,చట్టసభల్లో పెట్టుబడిదారుల ప్రభావం. శాసనసభ బలహీనమైతే, ప్రభుత్వాల నిర్ణయాలు బలహీనమైన పరిశీలనకు గురవుతాయి. ఈ పరిస్థితిలో పెద్ద పెద్ద కార్పొరేట్ శక్తులు పాలనపై మరింత ప్రభావం చూపగలవు. గనులు, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాలలో కార్పొరేట్ ప్రయోజనాలు ముందుకు రావడానికి అవకాశం ఉంటుంది. ప్రజా ప్రయోజనం, పేదల హక్కులు, అగ్రవర్ణేతర వర్గాల సంక్షేమం,ఇవి పక్కన పడతాయి. ఇది నిజానికి ప్రజాస్వామ్యానికి కాదు, “పెట్టుబడిదారుల ఆధిపత్యానికి” నాంది. ఇవన్నీ గుర్తించిన అఖిల భారత స్పీకర్ల సదస్సు 1993లోనే భారత చట్టసభలు సంవత్సరానికి కనీసం ఎన్ని రోజులు సమావేశం కావాలో నిబంధన చేయాలని తీర్మానించింది. జస్టిస్ వెంకటాచలయ్య కన్సిట్యూషనల్




రివ్యూ కమిటీ కూడా లోక్‌సభ 120 రోజులు, రాజ్యసభ 100 రోజులు, రాష్ట్ర అసెంబ్లీలు కనీసం 50 – 90 రోజులు సమావేశం కావాలని సూచించింది. కానీ ముప్పై ఏళ్లైనా ఆ సూచనలు అమలుకాలేదు. ఎందుకు? రాజకీయ నాయకులలో ఆత్మపరిశీలన లేకపోవడం, ప్రజల్లో కూడా చట్టసభల పనితీరు పై తగిన ఆందోళన లేకపోవడం, ఎన్నికలు,ప్రచారాలు,విద్వేష రాజకీయాలు అన్ని వ్యవస్థలను కప్పేస్తుండటమే దీనికి ప్రధాన కారణం.బిల్లులు, బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రభుత్వ అజెండా, ప్రశ్నోత్తరాల సమయం (క్వశ్చన్ అవర్)లో చర్చను అనుమతించరు. ప్రతిపక్షాల అభ్యర్థన మేరకు నిజమైన, స్వేచ్ఛాయుత చర్చ వాయిదా తీర్మానం ద్వారా మాత్రమే జరుగుతుంది లేదా స్వల్ప వ్యవధి చర్చ ద్వారానో లేక సావ దాన తీర్మానం ద్వారానో జరుగుతుంది. ఇవి సువ్యవస్థితమైన, మొదటి నుంచీ అనుసరిస్తున్న పార్లమెంటరీ పద్ధతులు, సంప్రదాయాలు,ఇకభారత పార్లమెంట్ వ్యవస్థలో వాయిదా తీర్మానం (Adjournment Motion) ఒక అత్యంత కీలకమైన సాధనం. ఇది ప్రభుత్వంపై ప్రత్యక్ష అభిశంసనగా పరిగణించబడే అరుదైన పార్లమెంటరీ ప్రక్రియ. ఇందుకు సంబంధించిన నియమం లోక్సభ కార్యక్రమాల నియమావళిలోని 57వ నియమంలో స్పష్టంగా పేర్కొనబడింది. ప్రభుత్వ బాధ్యతకి సంబంధించిన, ఇటీవల సంభవించిన అత్యంత ప్రాధాన్యమైన నిర్దిష్ట సంఘటనపై చర్చను కోరుతూ సభ్యులు ముందస్తుగా నోటీసు ఇచ్చినప్పుడు మాత్రమే ఈ తీర్మానం పరిశీలనకు వస్తుంది. ఇది ఆ రోజు నిర్ణయించబడిన కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేయగల శక్తి కలిగి ఉంటుంది.

ఎగువ సభ అయిన రాజ్యసభలో కూడా సభా కార్యక్రమాలను నిలిపివేసే ప్రత్యేక నిబంధన ఉంది. రాజ్యసభ కార్యక్రమాల నియమావళిలోని 267వ నియమం ప్రకారం అత్యవసర ప్రజా ప్రాధాన్యమున్న అంశంపై చర్చ జరపడానికి సభ్యులు నోటీసు ఇవ్వగలరు. దీనిద్వారా ఆ రోజు కార్యక్రమాలను నిలిపివేసి అంశంపై సమగ్ర చర్చకు అవకాశం లభిస్తుంది.

అదేవిధంగా స్వల్ప వ్యవధి చర్చలు కూడా పార్లమెంటరీ పద్ధతిలో ముఖ్యమైన భాగం. లోక్సభలో నియమం 193, రాజ్యసభలో నియమం 176 ప్రకారం తక్షణ ప్రజా ప్రాధాన్యమున్న విషయాలపై స్వల్ప వ్యవధి చర్చలు జరుగుతాయి. ఇవి ప్రభుత్వాన్ని బాధ్యత వహింపజేయడానికి ఉపయోగపడే సరళమైన, కానీ ప్రభావవంతమైన విధానాలు.

సావధాన తీర్మానం (Calling Attention Motion) చాలా నిరపాయకరమైన ప్రక్రియగా భావించబడుతుంది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అత్యవసర అంశాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు లోక్సభలో నియమం 197, రాజ్యసభలో నియమం 180 సభ్యులకు అనుమతిస్తుంది. దీనిపై మంత్రి తప్పనిసరిగా ప్రకటన చేయాలి. ఇది ప్రభుత్వం స్పందించేలా చేసే ముఖ్యమైన ప్రజాస్వామ్య పద్ధతి.

ఈ విధంగా, వాయిదా తీర్మానం నుంచి స్వల్ప వ్యవధి చర్చ దాకా, ప్రతి పార్లమెంటరీ సాధనం ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తుంది.ఇకప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన ప్రక్రియ ప్రజల స్వరం. ప్రతీ నియోజకవర్గంలో బాధలు వున్నాయి,నీళ్లు లేవు, రోడ్లు లేవు, ఉద్యోగాలు లేవు, పింఛన్లు ఆలస్యం, ఆసుపత్రుల పరిస్థితి దయనీయంగా ఉంది, రైతుల సమస్యలు ఎప్పటికీ తగ్గడం లేదు. కానీ వీటిని సభలో పెద్దఎత్తున వినిపించడానికి అవకాశం లేదు. సభ సమావేశమే జరిగితే మాట్లాడగలరు. సమావేశాలు తగ్గిపోతే ప్రజా సమస్యలు కూడా సభ వెలుపలే మిగిలిపోతాయి. ఎన్నికల సమయంలో ఇచ్చే వాగ్దానాలు సభలో పట్టింపు పొందవు. ప్రజలు ప్రశ్నలు అడుగుతారు కానీ వారి ప్రతినిధులు ప్రభుత్వం దగ్గర తగిన సమాధానాలు రాబట్టడానికి అవసరమైన వేదికే లేకుండా పోతోంది.ప్రపంచంలోని పలు ప్రజాస్వామ్యాలను పరిశీలిస్తే మన పరిస్థితి ఎంత వెనుకబడిందో స్పష్టమవుతుంది. అమెరికన్ హౌస్ ఆఫ్ రెప్రెజెంటేటివ్స్ సంవత్సరానికి 146 రోజులు పని చేస్తుంది. ఫ్రాన్స్ 120 రోజుల నిబంధనను పాటిస్తుంది. బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్ 143 రోజులు పనిచేస్తుంది. జపాన్ పార్లమెంట్ 150 రోజుల సమావేశాలను తప్పనిసరిగా నిర్వహిస్తుంది. ఇవన్నీ అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్యాలు. కానీ మన ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతి పెద్దది, అయినా అత్యల్ప సమావేశ దినాలతో నడుస్తోంది.ఇలాగే సాగితే ప్రజాస్వామ్యం అనే పదం పుస్తకాలలో మాత్రమే మిగిలిపోతుంది. అసలు ఆచరణలో మాత్రం నేతాస్వామ్యం పెరిగిపోతుంది. శాసనసభలు ప్రజలకు పని చెయ్యని, నాయకులు ప్రసిద్ధి కోసం మాట్లాడే వేదికలుగా మారిపోవటం ప్రజా పాలనను తీవ్రంగా దెబ్బతీస్తుంది. చట్టసభల్లో చర్చలు తగ్గిపోతే పాలకులు తప్పులు చేస్తూనే ఉంటారు , ఎవరు ప్రశ్నించరనే నమ్మకంతో వ్యవస్థ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా, కొన్నిసార్లు అధికార దుర్వినియోగానికి కూడా గురవుతోంది.భారతదేశపు భవిష్యత్తు ఇలా నిలదొక్కుకోలేను. మన రాజ్యాంగ నిర్మాతల తత్వం ఏమిటి? ప్రభుత్వాలు ప్రజలకు శాశ్వతంగా జవాబుదారీగా ఉండాలి. చట్టసభలు ప్రభుత్వాల పనితీరును నిపుణుల్లా పరిశీలించాలి. ప్రతి విధానాన్ని అమలు చేసే ముందు ప్రజల ప్రయోజనాలను ఆలోచించాలి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు సంవత్సరానికి వందకు పైగా రోజులు ప్రజా సేవకులుగా పని చేయాలి. కానీ నేడు ఆ కలలు మసకబారుతున్నాయి.ఈ పరిస్థితుల్లో అవసరమయ్యేది పెద్ద పెద్ద ప్రకటనలు కాదు,చట్టసభలును బలపరచే విధానాలు. రాజ్యాంగమే వార్షిక సమావేశ దినాలను నిర్దేశించాలి. ప్రశ్నోత్తర కాలాన్ని చట్టపరంగా రక్షించాలి. అంతరాయాలను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలు చర్చ లేకుండా ఆమోదం పొందకుండా నిబంధన పెట్టాలి. కమిటీ వ్యవస్థను శక్తివంతం చేయాలి. ప్రతిపక్షం, ప్రజలు, పౌర సమాజం అందరూ చట్టసభలను గౌరవించే సంస్కృతి ఏర్పడాలి.ప్రజాస్వామ్యం అంటే రోడ్లుపై జనసమూహం కాదు. ప్రజాస్వామ్యం పార్లమెంటులో, అసెంబ్లీల్లో జవాబుదారీతనం, చర్చలు, ప్రశ్నలు, వాదనలు, వివరణలు జరిగితేనే బతికుంటుంది. వాటిని బలహీనపరచడం అంటే దేశ భవిష్యత్తును బలహీనపరచడం.అందుకే ఈరోజు అత్యవసరమైన విషయం చట్టసభలు తిరిగి చైతన్యంతో పనిచేయాలి. ప్రజలు కూడా తమ ప్రతినిధుల పనితీరును గమనించాలి. శాసనసభల సమావేశాలు తగ్గుతున్నాయనే విషయంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలవ్వాలి. మన దేశం ప్రజాస్వామ్య పునాదుల మీదే ఎదిగి ఉన్నది. ఆ పునాదులు బలహీనమైతే అడ్డగోలుగా ఏ ప్రభుత్వం వచ్చినా అది ప్రజలకు సేవ సమగ్రంగా చేయలేదు.మన రాజ్యాంగం ఇచ్చిన హామీ ప్రజలే పరమాధికారులు. ఆ అధికారం నిజంగా ప్రజల చేతుల్లో ఉండాలంటే శాసనసభలు బలంగా, తరచుగా, పారదర్శకంగా, ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలి. చట్టసభలు చైతన్యవంతమైతే దేశం బలపడుతుంది. అవి బలహీనమైతే ప్రజాస్వామ్యం పేరుకే మిగిలిపోతుంది.ఇది కేవలం రాజకీయ అంశం కాదు,దేశ పౌరుల భవిష్యత్తును నిర్ణయించే అత్యంత ప్రధానమైన జాతీయ సమస్య.భారతదేశం ప్రపంచ ప్రజాస్వామ్యాల్లో శిరోమణిగా నిలవాలంటే చట్టసభలు మళ్లీ చర్చల కేంద్రాలుగా మారాలి,ఇదే నేటి అత్యవసర సత్యం.

# పరిశ్రమ అవసరాలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

- మ్యానుఫాక్చరింగ్ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- ఎంపీ లావు కృష్ణ దేవరాయలు
- గ్లోబల్ టీపీఓ , హెచ్ఆర్ లీడర్షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025




**హైదరాబాద్, వెలుతురు డిసెంబర్ 6, 2025:**
పరిశ్రమ అవసరాలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంపీ లావు కృష్ణ దేవరాయలు తెలిపారు. 'తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్‌తో కలిసి గ్లోబల్ టీపీఓ , హెచ్ఆర్ లీడర్షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025ను మాధాపూర్‌లోని టీ–హబ్లో రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాస్కామ్ 2000, 2002, 2004 రిపోర్టులు విడుదల చేసినప్పుడు మీ విద్యార్థులు ఈ ఉద్యోగాలను నిర్వహించడానికి ఇంకా పూర్తి సిద్ధంగా లేరని చెప్పిందన్నారు. అందుకే మార్పు చాలా వేగంగా జరగాలన్నారు. నాలుగైదేళ్ల తర్వాత మన విద్యార్థులు సిద్ధం కావచ్చు, కానీ వచ్చే ఏడాది పరిస్థితి ఏమిటి?, మరో ఒకట్రెండు ఏళ్లలో ఆ మార్పునకు తగినట్లు తయారవుతారా? లేదా? అన్నదే మన ముందున్న ప్రధాన సవాలు అన్నారు. ఐదారేళ్ల తర్వాత విద్యార్థులకు గానీ, పరిశ్రమలకు గానీ చెప్పాల్సిన అవసరం ఉండదన్నారు. అప్పటికి వారంతట వారే సిద్ధమవుతారన్నారు. ఈ మార్పు జరుగుతున్న సమయం ఎంతో కీలకమన్నారు. అందుకనే హెచ్ఆర్ వైపు నుంచి ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్లకు సహకారం ఇవ్వాలన్నారు. ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు విద్యార్థులతో, మేనేజ్‌మెంట్‌తో, పరిశ్రమలతో నిజాయితీగా ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే విశ్వసనీయత పెరుగుతుందన్నారు. అందరూ ఐటీ గురించే ఎక్కువగా మాట్లాడుతారన్నారు. దానిపైనే అందరి దృష్టి ఉంటుందన్నారు. కానీ మన ముందున్న మరో కీలక అవకాశం మ్యానుఫాక్చరింగ్ రంగం అన్నారు. మ్యానుఫాక్చరింగ్ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఎలాంటి పరిశ్రమలు బాగా పని చేస్తున్నాయో? అవన్నీ మరింత విస్తరించడానికి, ఎక్కువగా పెట్టుబడులు పెట్టడానికి, ఇంకా ఎక్కువ ఉద్యోగాలు సృష్టించడానికి అదనపు ప్రయోజనాలు అందిస్తోందన్నారు. విద్యార్థులను మ్యానుఫాక్చరింగ్ వైపు ప్రోత్సహించడంలో ఉన్న సమస్య ఏమిటంటే, ప్రారంభ స్థాయి జీతం ఐటీ రంగంతో పోలిస్తే కొంచెం తక్కువగా ఉంటుందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి వచ్చారన్నారు. రెండు రోజుల ఈ అంతర్జాతీయ సదస్సు ఈరోజు ముగిసింది. ఈ సమ్మిట్‌లో దేశ నలుమూలల నుంచి వచ్చిన 24 రాష్ట్రాల ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ ఛాప్టర్లు, హెచ్ఆర్ నాయకులు, పాలసీ మేకర్లు, అకాడమిషియన్లు ఒకే వేదికపై సమావేశం అయ్యారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్, హ్యూమన్ రిసోర్స్ అభివృద్ధి రంగాల్లో సంభాషణ, సహకారం, వినూత్నతకు ఇది ఒక విశేషమైన వేదిక అయింది. ఈ సమ్మిట్లో జాతీయ, అంతర్జాతీయ హెచ్ఆర్ నాయకుల కీలక ప్రసంగాలు, ప్యానల్ చర్చలు, టీపీఓలు, హెచ్ఆర్ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులకు ప్రత్యేక నెట్‌వర్కింగ్ అవకాశాలు, 24 రాష్ట్ర ఛాప్టర్ల మధ్య సహకార కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, ఇండస్ట్రీ, అకాడమియా భాగస్వామ్యాల బలోపేతంపై దృష్టి సారించారు. ఈ సమ్మిట్ భారతదేశంలో ప్రతిభ అభివృద్ధి, ప్లేస్‌మెంట్ వ్యూహాలకు కొత్త దిశను చూపుతుంది. విద్య, ఉపాధి రంగాల్లో ఇన్నోవేషన్, లీడర్షిప్‌కు కేంద్రంగా హైదరాబాద్ స్థాయిని మరింత బలోపేతం చేస్తుంది.

## భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటాం

- ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద జరిగిన అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
ఈ సమాజంలో నెలకొని ఉన్న అస్పృశ్యత అంటరానితనాన్ని రూపుమాపడానికి తన జీవితాన్ని సర్వస్వం త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ పీడిత ప్రజల హక్కుల ఉద్యమ సూరీడు భారతదేశంలో కొనసాగుతున్న అనాగరిక వ్యవస్థల గురించి అంతర్జాతీయ వేదికలపై గళమెత్తిన మేధావిగా కులం,మతం పేరుతో ఈ దేశ మూలవాసులపై అరాచకాలు అణచివేతలపై తిరుగుబాటు చేసిన దీరుడిగా అభివర్ణించారు.అంబేద్కర్ స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్లు సాధించుకోవాలని అన్నారు.అంబేద్కర్ తన యొక్క జీవితాన్ని ప్రజల హక్కుల సాధన కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ పొన్నం ముత్యం గౌడ్,కంచర్ల బద్రి విద్యార్థి జేఏసీ అధ్యక్షులు చేరాల వంశీ టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రవి కిరణ్ జనగాం సంతోష్ నరేశ్ దూడపాక సురేష్ నూకల మధు యాదవ్ దుర్గం సిద్ధార్థ రామ్మూర్తి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## 1.5 కేజీల గంజాయి పట్టివేత... ఆటో బైక్ స్వాధీనం

- 8 మంది పై కేసు నమోదు నలుగురు అరెస్ట్.



**బషీర్ బాగ్ వెలుతురు 6 డిసెంబర్ :**
మల్లెపల్లి లోని మంగూరు బస్తి నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుపుతుండగా ఎస్టిఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి టీం పట్టుకున్నారు. ఈ కేసులో 1.50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తో పాటు మూడు మొబైల్స్ ని ఒక ఆటోని బైక్ను కూడా సీజ్ చేశారు.. ఈ కేసులో కాంబినే మంగరాజ్, సద్దాం ఖాన్, కాండే రాధ, లోన్డే ఆర్తి నలుగురిని అరెస్ట్ చేశారు. మహమ్మద్ రిజ్వాన్, హీనా బేగం, గౌసియా,కామ్రేరోహితులు పై కేసు నమోదు చేశారు. వీరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గంజాయిని నిందితులను సీజ్ చేసిన ఆటో బైక్ లను నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

## జిహెచ్ఎంసి అంబర్పేట్ మున్సిపల్ గ్రౌండ్లో జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు



**బషీర్ బాగ్ వెలుతురు 6 డిసెంబర్ :**
జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా అంబర్పేట్ మున్సిపల్ గ్రౌండ్ జిహెచ్ఎంసి యూసిడి సెక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి వందమంది వికలాంగులు హాజరయ్యారు ముఖ్యఅతిథిగా అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మరియు జిహెచ్ఎంసి అధికారులు బీసీ దివాకర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రజిత గారి చేతుల మీదుగా వికలాంగులకు చెవి ఇయరింగ్ మిషన్లు ఆరు చేతి హ్యాండ్ సెట్లు 5 వీల్ చెర్లు రెండు నీ పాడ్స్ 10 అందజేశారు ఈ కార్యక్రమానికి పద్మాదిపి రెడ్డి దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ మహాలక్ష్మి కాచిగూడ బ్లైండ్ లెక్చరర్ అనిల్ రెడ్డి అంబర్పేట వికలాంగుల అధ్యక్షులు మంద బిక్షపతి సెక్రటరీ నర్సింగరావు ప్రవీణ్ ట్రెజరర్ అంబర్పేట్ కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ శ్రీనివాస్ అశోక్ కుమార్ స్వామి ఆర్పీలు ఇందులో పాల్గొన్నారుదు

## ప్రపంచ దేవాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల కార్యసంకల్పం, దివ్యాంగుల సిద్ధి కర్త కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్లు



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
శనివారం రోజున ప్రపంచ దేవాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ మహానగర పాలిక సంస్థ ఆధ్వర్యంలో ( వికాసం ) అనే వికలాంగుల కార్యసంకల్పం, దివ్యాంగుల సిద్ధి కర్త కార్యక్రమం అంబర్పేట్ ఫుట్బాల్ గ్రౌండ్లో నిర్వహించడం జరిగింది, ఈ యొక్క కార్యక్రమానికి అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, హిమైత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, గోల్నాక కార్పొరేటర్ లావణ్య, బాగ్ అంబర్పేట్ కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి, అరే పీత చేతుల మీదగా వికలాంగుల అందరికీ పరికరాలు అందించడం జరిగింది, యు సి డి రజిత రెడ్డి, అంబర్పేట్ సర్కిల్ ఆర్ పీస్ అందరూ మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

## కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం సామాజిక ఉద్యమ శక్తులు పోరాటాలకు సిద్ధం కావాలి.

- మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలి.
- మారుపాక అనిల్ కుమార్
- డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



**హిమాయత్ నగర్ వెలుతురు డిసెంబర్ 06:**
రాజ్యాంగ మౌలిక పునాదుల పైన దాడి చేస్తుంది రాజ్యాంగం నిర్మితమైన స్వతంత్ర సంస్థలను తమ జేబు స్వస్థలుగా బిజెపి మార్చుకుంటుంది అని అన్నారు.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి సందర్భంగా హిమాయత్ నగర్ లో వై జంక్షన్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, హైదరాబాదు జిల్లా కార్యదర్శి జైరుపోతుల కుమార్, కె మారుతి తో కలిసి నివాళి అర్పించారు. అనంతరం మారూపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కీర్తిప్రతిష్టలు ప్రతీ ఏటా ఆకాశం ఎత్తుకు పెరుగు తున్నాయి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత దేశం లో భూమి జాతీయాకరణ జరగాలని, పరిశ్రమలలో కార్మికు లకు యాజమాన్య వాటా ఉండాలని స్పష్టంగా పేర్కొ న్నాడు. మహిళా సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లును పార్లమెం ట్ లో ప్రవేశపెట్టిన బిల్లు పాస్ కాకుండా అడ్డుకున్నారు. కార్మికులకు కనీస వేతనం చట్టాన్ని 1948 సంవత్సరంలోనే ఆయన రూపొందించాడు.స్వాతంత్ర్య ఉద్యమకాలంలో 1925 సంవత్సరంలో ఏర్పడిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అంబేద్కర్ పట్ల విరోధి వైఖరి కలిగి ఉంద అని అన్నా రు .దేశభక్తి ముసుగులో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుంది. అడవులన్నింటినీ అదానికి అప్పగించడానికి ప్రయత్నం చేస్తుంది. యూనివ ర్సిటీలలో ప్రజాతంత్ర భావాలను నిరాకరి స్తుంది.అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం కోసం ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలి. నేడు సరళీకరణ కార్పొ రేట్ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం సామాజిక ఉద్యమ శక్తులు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. అంబేద్కర్ ఆశించిన కులరహిత సమాజాన్ని నేటి తరం దానిని సాధించడానికి సమరం చేయాలి. ఆది అంబేద్కర్ కల్పించే నిజమైనటువంటి వారు నివాళి అని అన్నారు.

## జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ నివాసంలో ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ







**ఎల్ బి నగర్ వెలుతురు డిసెంబర్ 06:**
ఎల్ బి నగర్ లోని మన్సూరాబాద్ మధుర నగర్ కాలనీ లో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ గురుస్వామి ఇంట్లో నిన్న రాత్రి ఆయన జన్మదిన సందర్భంగా అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని బచ్చు విశ్వ నాద్ గుప్తా గురుస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది, ఈ మహా పడిపూజకు వందలాదిమంది అయ్యప్ప స్వాములు మరియు వందలాది మంది భక్తులు చుట్టుపక్కన ఉన్న కాలనీవాసులు పాల్గొనడం జరిగింది, కన్నుల పండుగ జరిగిన ఈ మహా పడిపూజ మహోత్సవంలో అంబర్పేట్ విజయేందర్ గురుస్వామి ఆధ్వర్యంలో భజనతో పాటు ఎంతో అట్టహాసంగా పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కనకాల శ్యామ్ కురుమ ప్రతి ఒక్కరు ప్రతి రోజు ఎంతో బిజీ గా జీవనం కొనసాగిస్తున్నారు దానితో పాటు కొంత ఆధ్యాత్మికతకు కూడా కొంత సమయం ఇస్తుంటే అందరూ భక్తి శ్రద్ధలతో పాటు సుఖ సంతోషంగా ఉండవచ్చు అని ఆయన అన్నారు...ముఖ్య అతిథిగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మరియు ఇతర రాష్ట్ర నాయకులతో పాటు సూర్యప్రకాష్ గురుస్వామి, మల్లేష్ గురుస్వామి, మాలిగ లింగం గురుస్వామి, హరీష్ గురుస్వామి, రఘు యాదవ్ గురు స్వామి, శశిధర్ రెడ్డి గురుస్వామి,నరేష్ ప్రజాపతి గురుస్వామి, శీను గురుస్వామి హయత్ నగర్, సత్యనారాయణ గురుస్వామి, దెండే ఆనంద్ గురుస్వామి, జానకిరామ్ గురుస్వామి, బాబు గురుస్వామి, శ్రీధర్ గురుస్వామి తో పాటు హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివాజీ కురుమ స్వామి ,సన్నిధానం స్వాములు మణి తేజ,దేవ నాయక్,శివ రెడ్డి ,శివ యాదవ్,జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు...

## వృత్తి నైపుణ్య శిక్షణ సర్టిఫికెట్లు ప్రధానం



**బషీర్ బాగ్ వెలుతురు 6 డిసెంబర్:**
మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం, మిట్ట ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కాచిగూడ లోని మున్నూరు కాపు సంఘంలో వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో జాతీయ పర్యాటక మరియు అతిథి సత్కార నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ మరియు మిట్ట ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మిట్ట వినోద్ ముఖ్యఅతిథిగా పాల్గొని సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ యువతకు ఉపాది అవకాశాలు కల్పించడంలో మున్నూరు కాపు విద్యార్థి వసతిగృహం మిట్టా ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో దీపాల సురేష్, ఆకుల పాండురంగారావు, దదువై రాఘవేందర్, మందా సూర్య ప్రకాష్, పంజరి సంజయ్ నారాయణ, ఏక రాజేందర్ దాదువై రాధాకృష్ణ, మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాల కౌటాలలో పులి అడుగులు

గుర్తించి అటవీ అధికారులకు సమాచారం



**ఆదిలాబాద్,డిసెంబరు6 ( వెలుతురు):**
తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దులోని వార్ధా నదిలో పులి అడుగులను స్థానికులు గుర్తించారు. మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా థరూర్ గ్రామ సమీపంలోని వార్ధ నదిలో పులి అడుగులను స్థానికులు గుర్తించి మహారాష్ట్ర అటవీ అధికారులకు సమాచారం అందించారు. మహారాష్ట్ర అటవీ అధికారులు పులి అడుగులను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశారు. అడుగులు వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో స్పందించి కౌటాల సెక్షన్ అటవీ అధికారులు తులసీరాం, శ్రీదేవిలు వార్ధా నది పరిసరాలను పరిశీలించారు. తెలంగాణ వైపు పులి అడుగులు లేనప్పటికీ ప్రజలను అప్రమత్తం చేశారు. తాటిపల్లి గ్రామంలో చాటింపు వేయించారు.రైతుల చేన్లలో వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పులి అనవాళ్లు కనిపించినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు.

## లోయపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో మాదగోని బుగ్గరాములు ఇల్లు దగ్గం

- మాధగోని బుగ్గరాములు ఇల్లును పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు
- 5వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కొర్ర మోతీ రాంనాయక్



**మంచాల వెలుతురు డిసెంబర్ 6:**
మంచాల మండలం లోయపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ వల్ల మాధగోని బుగ్గ రాము లు ఇల్లు దగ్గమై ఇంటిలోఉన్నవంట సామాగ్రి బట్టలు బియ్యం కాలిపోయాయి ఈ విషయం తెలుసుకున్న లోయపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ అభ్యర్థి కొర్ర మోతీరాంనాయక్ మాధగోని బుగ్గ రాములు నివాసానికి వెళ్లి షార్ట్ సర్క్యూట్ కు దగ్గరమైన ఇల్లును పరిశీలించి బుగ్గరాములు కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కొర్ర మోతీ రాంనాయక్ 5వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు ఈ సందర్భంగా మోతి రాంనాయక్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మాధగోని బుగ్గరాములు కుటుంబానికి ప్రభుత్వం నుండి సహాయం అందేలా చూస్తాం బుగ్గ రాములు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొర్ర శ్రీనివాస్ నాయక్ మాజీ సర్పంచ్ మిద్దె శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకు సత్యనారాయణ గౌడ్ చెరుకు గణేష్ గౌడ్ కారింగ్ జంగయ్య గౌడ్ మూడో కోర్ర బాలునాయక్ నూతనగంటి వెంకటేష్ కోర్ర రాజు మొహమ్మద్ షరీఫ్ ఊరుపక్క సురేష్ ముసలి రాము చెరుకు చిన్న జంగయ్యగౌడ్ బూడిద సురేష్ కావలి అనిల్ యువకులు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి సీతక్క గారి స్వగ్రామంలో సర్పంచ్ ఏకగ్రీవం..



**ములుగు వెలుతురు డిసెంబర్ 06:**
స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారి సొంత గ్రామం ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని 7 పల్లెలు రాష్ట్ర మంత్రి సీతక్క గారి చొరవతో ఏకగ్రీవంగా కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థి ఆర్రెం వెంకన్న గారిని సర్పంచి గా మాజీ మంత్రి కీ:శే అజ్మీరా చందూలాల్ గారి అనుచరులకు ఉప సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా గ్రామస్థులు ఎన్నుకున్నారు తమ స్వగ్రామంలో గ్రామ సర్పంచిని ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మంత్రి సీతక్క గారు సంతోషాన్ని వ్యక్తం చేశారు గ్రామాభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తూనే ఉంటానని మంత్రి సీతక్క గారు అన్నారు

## అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే బడుగులకు న్యాయం

**- డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత**



**వెలుతురు నల్లగొండ, కలెక్టరేట్ డిసెంబర్ 06:**
సమాజంలో పేదలకు బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందంటే.. వారి స్వరం బలంగా వినిపిస్తుందంటే.. వారు తగిన రక్షణ గౌరవం పొందుతున్నారంటే దానికి కారణం అంబేద్కర్ రాసిన రాజ్యాంగంమే అని నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అన్నారు. అంబేద్కర్ 69 వర్ధంతి సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల్లో సాంఘిక, రాజకీయ, విద్యా చైతన్యాలను రగిలించిన స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు.బీసమ సమాజ స్వాప్నికుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలు స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. కేంద్రంలో బీజేపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల హక్కులను కాల రాస్తుందని, అందుకే ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగం రక్షించబడాలంటే దేశ ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లును ముందస్తుగా అదుపులోకి తీసుకున్న పోలీసులు




**మిర్యాలగూడ వెలుతురు డిసెంబర్ 06:**
ముఖ్యమంత్రి దేవరకొండ పర్యటన సందర్భంగా ముందస్తుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తున్న బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ గారిని ఉదయం అదుపులోకి తీసుకొని మిర్యాలగూడ పట్టణంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే సవాలుగా మారిందని బిసి రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు రిజర్వేషన్లు లేకుండానే సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తూ బీసీలను అన్యాయానికి గురిచేశాయని బీసీ రిజర్వేషన్లు తగ్గించాలని నిన్న హైదరాబాదులో సాయి ఈశ్వర చారి కూడా ఆత్మ బలిదానం చేసుకున్నారని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు ముందస్తు అరెస్టుతో బీసీ ఉద్యమాన్ని ఆపలేవని అన్నారు.అరెస్ట్ అయిన వారిలో,బీసీ మహిళా జిల్లా కార్యదర్శి బంటు కవిత, చిత్రం ఉమ ఉన్నారు. అక్రమ అరెస్టు పట్ల బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తీవ్రంగా ఖండించారు.

## వట్టిమర్తి గ్రామవాసికి డాక్టరేట్ పట్టా



**చిట్యాల వెలుతురు డిసెంబర్ 06:**
నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా లవేందర్ రెడ్డికి కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది . ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే గారి పర్యవేక్షణలో నల్లగొండ జిల్లా రెడ్డి కుల సంప్రదాయాలు- అధ్యయనం అనే అంశము పై పరిశోధన చేసినందుకుగాను నర్రా లవేందర్ రెడ్డి కి తెలుగు శాఖ నుండి డాక్టరేట్ ఇస్తున్నట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాజేందర్ ప్రకటించారు. ప్రస్తుతం నర్రా లవేందర్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాద్ తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నాడు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి

**గుండాల, వెలుతురు డిసెంబర్ 06 :**



గుండాల మండల కేంద్రంలోని అనంతారం గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులు అంబేద్కర్ జీవితం, ఆయన సాధించిన విజయాలు, రాజ్యాంగ రూపకర్తగా చేసిన కృషి గురించి విద్యార్థులకు తెలియజేశారు. సామాజిక సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సుధాకర్, అంగన్వాడి టీచర్లు రేణుక, లావణ్య, స్వీపర్ రమేష్, నాంచారమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం వస్తున్న.. కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించండి

**- తాటిపాముల గ్రామ పంచాయతీ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి కోల రమేష్ గౌడ్**

**- స్వచ్ఛత, అభివృద్ధి, పారదర్శక పాలన మా హామీ.తాటిపాముల గ్రామం ముందుకు సాగాలంటే కలిసి గెలుద్దాం!**

**సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి కోల రమేష్ గౌడ్**



**తాటిపాముల వెలుతురు డిసెంబర్ 06:**
తాటిపాముల గ్రామం మరింత ముందుకు సాగాలంటే ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని రమేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. యువతకు అవకాశాలు, మహిళలకు భద్రత, రైతులకు సాయం, వృద్ధులకు ఆదరణ, ప్రతి వర్గానికి చేయూత అందించే గ్రామ పాలన అవసరమని తెలిపారు. గ్రామ అభివృద్ధే నా ఏకైక అజెండాతో అభ్యర్థిగా బరిలో నిలిచానని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం తాను రూపొందించిన ప్రణాళికలను ప్రజల ముందుకు తీసుకు వస్తున్నట్లు వెల్లడించారు. పంచాయతీ నిధుల పారదర్శక వినియోగం, శు ద్ధి నీరు, శుభ్రమైన గ్రామం, యువతకు క్రీడావేదికలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మహిళల కోసం స్వయం సహాయక వనరుల బలోపేతం, రైతులకు కాలానుగుణ సాయం, వ్యవసాయ అవసరాలపై త్వరిత స్పందన ఇలా అనేక అంశాలపై కేంద్రీకరించి పనిచేస్తానని తెలిపారు. తాటిపాముల అభివృద్ధి కోసం వస్తున్న ఆశీర్వదించి, కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని తాటిపాముల గ్రామ ప్రజలకు సర్పంచ్ అభ్యర్థి రమేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని పిలుపు

**- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి**

**- ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రచారం చేయాలి**

**- పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం - మల్లేష్**

**- ఉచిత బస్సు, గృహజ్యోతి పథకాలు - ప్రజల వరం**



**గుండాల, వెలుతురు డిసెంబర్ 06 :**
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా వివరించాలని ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు జిల్లా నాయకులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ చిప్పలపల్లి మల్లేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహ జ్యోతి, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ఈ పథకాలు నిరంతరం కొనసాగాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావికాస కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వివరించి ప్రచారం చేయాలని మల్లేష్ పిలుపునిచ్చారు.

## స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

**- అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు**

**- చారకొండ ఎస్ఐ పి.వీరబాబు**





**వెలుతురు, చారకొండ డిసెంబర్ 06 :**
స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకోవాలని చారకొండ ఎస్ఐ పి.వీరబాబు ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని, పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని కోరారు. సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకర పోస్టులు పెట్టడం, తప్పుడు ప్రచారాలు చేయడం వంటివి చట్టరీత్యా నేరం అని, పోలింగ్ రోజున ఓటర్లు నిస్సం కోచంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎవరైనా ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసి నా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా అనుమానా స్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎలక్షన్ కోడ్ దృశ్య మద్యం విక్రయించిన చట్టరీత్యా నేరమే అని, రూ. 50 వేలకు మించి డబ్బులను, అలాగే బంగారం లాంటి ఆభరణాలను కూడా తీసుకెళ్లకూడదని తెలిపారు. ఒక వేళ తీసుకెళ్లాల్సి వస్తే సంబంధిత ఆధారాలతో తీసుకెళ్లాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఎస్ఐ వీరబాబు కోరారు.

## మరో ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తాను ..

**- ఇంటి ఇంటికి తిరిగి ప్రచారం చేస్తున్న పలివెల సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి గజ్జెల ధనలక్ష్మి బాలరాజు**

**- ఉంగరం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరిన గజ్జెల ధనలక్ష్మి బాలరాజు**



**మునుగోడు డిసెంబర్ 06 వెలుతురు:**
మరో ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని పలివెల బిర్ఎస్ పార్టీ అభ్యర్థి గజ్జెల ధనలక్ష్మి బాలరాజ్ గారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, తమ ప్యానెల్ వార్డు సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కోసం, ప్రతి ఇంటి అవసరం కోసం, ప్రతి కుటుంబ భవిష్యత్ కోసం ముందుకు వచ్చానని తెలిపారు. రాజకీయ స్వార్థం కోసం కాదని, గ్రామ సేవ చేయడానికి ఈ ఎన్నికల బరిలో దిగానని తెలిపారు. గత కొంతకాలంగా గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని అందుకు ఆశీర్వదించి తన గుర్తు ఉంగరం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సంక్షేమ పథకాల అమలను అందరికీ చేరే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళల సాధికారత యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు.

## టీపీయూఎస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

**జిల్లా అధ్యక్షురాలుగా రేపాక ఉమ**



**భువనగిరి వెలుతురు డిసెంబర్ 6 :**
నూతన కార్యవర్గం అంకిత భావంతో పనిచేసి సంఘ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సమావేశం గురువారం భువనగిరి లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగీవ్రంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా రేపాక ఉమ, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు యాదగిరి లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి గా కంబాలపల్లి కృష్ణయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు గవ్వ జ్యోతి , సి వి శ్రీనివాస్ ,కొత్తకొండ శ్రీధర్ మరియు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ,సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం నకు శుభాకాంక్షలు తెలిపారు .

## గుర్రాల దండి సర్పంచ్ అభ్యర్థిగా ధరావత్ రాజు



**బీబీనగర్ డిసెంబర్ 6 :**
పోటీ చేయు అభ్యర్థి పాస్ , దీపిక, ప్రవర్తన నియమావళి ఎలక్షన్ అధికారి చేతులమీదుగా అందుకోవడం జరిగింది.



శనివారం రోజున భువనగిరి బైపాస్ వివేరా హొటల్ వద్ద టీపీసీసీ అధ్యక్షులు ఏమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారిని మార్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అతహర్
**భువనగిరి వెలుతురు డిసెంబర్ 6 :**

## డిసెంబర్ 21న జాతీయ లోక్ అదాలత్

**- సమన్వయంతో ఏర్పాట్లు చేసుకోవాలి.**

**- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష**



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 06:**
ఈ నెల 21న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకునేలా, పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష సమక్షంలో సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి దంతూరి సత్తయ్య తో కలిసి సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వేంకటేశ్వర్లు, రామన్నపేట, వలిగొండ, ఎస్ఐ లు డి.నాగరాజు, యుగేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ హక్కులు కల్పించిన అంబేద్కర్ సేవలు మరువలేనివి.



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 06:**
అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఎన్ అశోక్ ఏర్పాటు చేసిన బుద్ధ అంబేద్కర్ గ్రంథాలయం ముఖద్వారం ఏర్పాటుచేసిన. అంబేద్కర్ బుద్ధుని విగ్రహాలకు రంగులు వేయించి సుందరీకరణ చేయించి అంబేద్కర్ బుద్ధునికి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. అనంతరం డాక్టర్ అశోక్ మాట్లాడుతూ బుద్ధుని బోధలు అనుసరించి నడిచి సమాజంలో ప్రతి మనిషిని ప్రేమించాలని. కోరారు మరో మహనీయుడు అంబేద్కర్ మార్గంలో నడిచి ప్రతి ఒక్కరు జ్ఞానం వైపు నడిచి నూతన సమాజాన్ని నిర్మించాలని. నూతన సమాజంలో కూడా ఓటు హక్కు చాలా విలువైందని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసే పాలకులను ఎన్నుకొని ఆదర్శ సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆది జాంబవ సంగం అధ్యక్షులు సండ్ల లింగయ్య ప్రధాన కార్యదర్శి నకరికంటి రవి. సహాయ కార్యదర్శి సహాయ కార్యదర్శి జినుక లింగయ్య బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు గూని రాజు,జీనుక గోవర్ధన్,కందాల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట మండలంలోని వివిధ గ్రామంలలో ఇంటింటి ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు



**యాదగిరిగుట్ట మండలం వెలుతురు డిసెంబర్ 06:**
లప్ప నాయక్ తండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ధీరావత్ గాసిరాం నాయక్, పెద్ద కందుకూరు అభ్యర్థి కే లత నరసింహులు, మాసాపేట అభ్యర్థి కళ్యం జాంగిర్ గౌడ్ గెలుపు కొరకు శనివారం రోజున ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న యాదగిరిగుట్ట మాజీ దేవస్థానం ధర్మకర్త పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్ సీనియర్ నాయకులు లకణ్ బాయ్ అసంఘటిత కార్మికుల కాంగ్రెస్ టౌన్ మైనార్టీ అధ్యక్షులు. షేక్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# మహిళలకు ఆర్థిక స్వాలంబన అవసరం - కార్పొరేటర్



**నాగోల్ వెలుతురు డిసెంబర్ 06:**
మహిళలకు ఆర్థిక స్వాలంబన అవసరమని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం నాగోల్ డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన కె ఎస్ ఎస్ ఆర్ వారి వీ4 ఈవెంట్స్ ఘనంగా మొదలైంది. కార్యక్రమానికి కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ , కొత్తపేట కార్పొరేటర్ నాయి కోటి పవన్ కుమార్ అతిథులుగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, హస్తకళలు, హ్యాండ్లూమ్ వస్త్రాలు, జ్యువెలరీ స్టాళ్లను పరిశీలించారు. మహిళా కళాకారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, ఉత్సాహవంతులైన వ్యాపారులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను అభినందించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి, హస్తకళల ప్రోత్సాహం కోసం ఇలాంటి ఈవెంట్స్ గొప్ప వేదికగా నిలుస్తున్నాయని సందేశం ఇచ్చారు.కార్యక్రమం అనంతర నిర్వాహకులైన,పోరెడ్డి కవితా రెడ్డి, పిండి శిరీషా రెడ్డి, చిలుముల రజిత రెడ్డి , కొత్తకాపు శశిరేఖ రెడ్డికి కార్పొరేటర్లు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రజావేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వీరోపాటు తెలంగాణ రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నూకల పద్మ రెడ్డి,గీత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో దద్దరిల్లిన అసెంబ్లీ




**రామంతపూర్ వెలుతురు డిసెంబర్ 06:**
విద్యార్థులతో స్కూల్ లో ఏర్పాటు చేసిన అసెంబ్లీ దద్దరిల్లిన ఘటన శనివారం సెయింట్ జోన్స్ పాఠశాలలో చోటుచేసుకుంది. రామంతపూర్ భరత్ నగర్ లో గల సెయింట్ జోన్స్ హైస్కూల్లో తెలంగాణ అసెంబ్లీని తలపించేలా విద్యార్థులు స్కూల్ ఆవరణంలో నిర్వహించిన స్వయం అసెంబ్లీ సమావేశం అందరినీ ఆకట్టుకుంది. ప్రభుత్వాన్ని తలపించేలా స్పీకర్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల హవ భావాలు ఎలా ఉంటాయో అలా కన్నుల కట్టినట్లు ప్రదర్శించారు. అలాగే ప్రతిపక్ష స్థానంలో విద్యార్థులు ఎమ్మెల్యేలుగా ప్రతిపక్ష హోదాలో సంధించిన ప్రశ్నలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రజలకు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎలా అమలు చేయాలో ప్రభుత్వ హోదాలో ఉన్న విద్యార్థులు చక్కగా వివరించారు. అలాగే ప్రభుత్వాలు చేస్తున్న తప్పిదాలను ప్రతిపక్ష హోదాలో కూర్చున్న విద్యార్థులు విమర్శించిన తీరు చాలా చక్కగా ఉంది. విద్యార్థి దశ నుంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో రాజకీయాల పట్ల అవగాహన పెరిగి విద్యార్థులు కూడా రాజకీయాలలోకి వచ్చి ప్రజలకు సేవలు అందించి నవ సమాజ నిర్మాతలుగా మారుతారని పాఠశాల ప్రిన్సిపాల్ సూరం రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించిన టీచర్స్ ని, విద్యార్థులను పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సూరం మమత రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# పలివెల లో జోరుగా సాగుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చెరుకుపల్లి లక్ష్మి వెంకటయ్య ప్రచారం



**మునుగోడు డిసెంబర్ 06 వెలుతురు:**
పలివెల సర్పంచ్ అభ్యర్థి చెరుకుపల్లి లక్ష్మి వెంకటయ్య బ్యాలెట్ నమూనా పత్రాలు చేతబూని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఓటు వేయాలని,పలివెల గ్రామ అభివృద్ధి ఏ విధంగా చేయాలని వివరిస్తూ ప్రతి ఓటరు డబ్బును కాదు, ప్రజల బాగోగులు చూసే అభ్యర్థిని చూసి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

# రావిపహాడ్ తండా గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ



**బీబీనగర్ వెలుతురు డిసెంబర్ 6 :**
బీబీనగర్ మండలం రావిపహాడ్ తండా గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బానోత్ శంకర్ నాయక్ ని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన భువనగిరి మాజీ శాసనసభ్యులు %ం% బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి

# సంక్షేమం కోసం ప్రతి అడుగు, ప్రజల భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉంటుంది

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి





**హయత్ నగర్ వెలుతురు డిసెంబర్ 06:**
మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి డ్రైనేజీ పనులు ప్రారంభోత్సవం మరియు సంక్షేమ సంఘ మొదటి అంతస్తు భవనాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసి CSR కాలనీలో భూగర్భ డ్రైనేజీ సుమారు రూ:- 7.00 లక్షల వ్యయంతో కూడిన పనులను ప్రారంభం.. లెక్చరర్స్ కాలనీలో సంక్షేమ సంఘ మొదటి అంతస్తు సుమారు రూ:- 40.00 లక్షల వ్యయంతో కూడిన భవనాన్ని కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి ఎంతో ఘనంగా ప్రారంభించుకున్నారు.. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ అనునిత్యం ప్రజల సమస్యలపై కొట్లాడి నిధులను సమకూర్చుతున్నామని, ప్రజల కోసం అనునిత్యం కృషి చేస్తామని తెలుపుతూ CSR కాలనీలో లోక్ సభ ఎలక్షన్ కోడ్ అమలు అప్పటినుండి పెండింగ్లో ఉన్న పనులు జలమండలి ఎం.డి అశోక్ రెడ్డి ఐఏఎస్ ని పలుమార్లు కలిసి నిధులు మంజూరు చేయించి ఈ యొక్క పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ఇంకా కొన్ని కాలనీలలో తాగునీటి పైప్లైన్ మరియు భూగర్భ డ్రైనేజీ లైన్లు ఎస్టిమేషన్ వేసి టెండర్ ప్రాసెసింగ్ లో ఉన్నాయని అతి తొందరలోనే ఆ పనులను ప్రారంభించుకుంటామని తెలిపారు. లెక్చరర్స్ కాలనీ సంక్షేమ సంఘ భవనం మొదటి అంతస్థ నిర్మాణం నా కార్పొరేటర్ ఎలక్షన్ లో ఇచ్చిన హామీ ప్రకారంగా పూర్తి చేసుకోవడం జరిగింది.అదేవిధంగా కాలనీలో భాష్యం బ్లూమ్స్ స్కూల్ ఆవరణంలో అన్ని సిసి రోడ్లు ఎంతో సుందరంగా నిర్మించుకోవడం జరిగింది. ఇంకా కొన్ని రోడ్లలో భూగర్భ డ్రైనేజీ మరియు సి.సి రోడ్లు తొందరలోనే పూర్తి చేస్తానని అన్నారు.. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు సత్తిపండు,కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య యాదవ్, కృష్ణయ్యా,యం.రవి కుమార్ గౌడ్,బి.వెంకట రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, పి.గోపాల్ రెడ్డి,యాదయ్య,మోహన్ రెడ్డి,సీనియర్ సిటిజన్ చింతల యాదగిరి,విష్ణు వర్ధన్ రాజు,చంద్ర రెడ్డి, కోటేశ్వర రావు మరియు బీజేపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు

**మంచాల వెలుతురు డిసెంబర్ 6:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిని వాళులర్పించిన వివిధ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ మంచాల వ్యవసాయ సహకార బ్యాంక్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ భీంరావ్ రాంజీ అంబేద్కర్ డా.బాబా సాహెబ్ అంబేద్కర్ గా సుపరిచితుడు 1891ఏప్రిల్ 14-195 6 డిసెంబర్ 6ప్రముఖ భారతీయ న్యాయవాది ఆర్థిక శాస్త్రవేత్త రాజకీయ నేత సంఘ సంస్కర్త ఇతను అంటరానితనం కుల నిర్మూలన కోసం ఎంతో కృషిచేశాడు.అతను స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖమంత్రి రాజ్యాంగ శిల్పి ఇతను కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి డాక్టరేట్ పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించాడు న్యాయ సామాజిక ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశాడు మొదట్లో న్యాయవాదిగా అధ్యాపకుడిగా ఆర్థికవేత్తగా పనిచేశాడు తరువాత భారతదేశ స్వాతంత్ర్యం పత్రికల ప్రచురణ దళితుల సామాజిక రాజకీయ హక్కులు భారతదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం కృషిచేశాడు1956లో ఇతను బౌద్ధ మతాన్ని స్వీకరించడంతో దళితులు సామూహికంగా బౌద్ధంలోకి మతమార్పిడి చేసుకున్నారు 1990లో భారత ప్రభుత్వం అ త్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ఇతనికి మరణాంతరం ప్రకటించింది భారతదేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన నాయకుడు ఇతను



చేసిన విశేష కృషికి ఇతని పుట్టినరోజునుఅంబేద్కర్ జయంతి గా జరుపుకుంటారు 2012లో ది హిస్టరీ ఛానల్ రిలయన్స్ మొబైల్ భాగస్వామ్యంతో అవుట్ లుక్ మ్యా గజైన్ నిర్వహించిన దిగ్రేటెస్ట్ ఇండి యన్ పోల్ లో అతను మొదటిస్థానంలో ఎంపికైయ్యాడు అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు సుంకరి పండరినాథ్ గౌడ్ ఆనంగళ్ల యాదయ్య ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రాములు గౌడ్ గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ వెదిరె రమణారెడ్డి అంతటి రాజు గౌడ్ మాధగోని జంగయ్యగౌడ్ కంబాలపల్లి బుగ్గరాములు చెరుకు నరసింహ గౌడ్ సుంకరి ప్రవీణ్ గౌడ్ వెదిరె సికిందర్ రెడ్డి రావుల రాఘవ పాండాల శ్రీనివాస్ గౌడ్ నూకం మల్లేష్ ముదిరాజ్ ఎండి ఇమ్రాన్ వస్పరి కుమార్ మార లక్ష్మణ్ బుట్టి కృష్ణ ముదిరాజ్ ఆనంగళ్ళ దేవరాజ్ ఎండి అశ్వత్ రైనా బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆకారపు కృష్ణ ప్రజాగళం దామెర భూపాల్ డి.ఎస్.పి పార్టీ నాయకుడు కొండగారి శ్రావణ్ చిందం శ్రీశైలం అంతటి రాజుగౌడ్ సిహెచ్ నరసింహ, లైబ్రరీ యాదయ్య ప్రవీణ్ జోగు వినోద్ కుమార్ మంకు సురేష్. కొండిగారి ప్రసాద్ రావుల చంద్రయ్య శివలింగం శివ. రంజిత్ తదితరులు పాల్గొన్నారు

# బ్యాంకు మరియు చిట్ ఫండ్ అధికారులతో సమావేశమైన న్యాయమూర్తులు



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
డిసెంబర్ 21 న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను పునస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కోర్టు ఆవరణలో బ్యాంకు మరియు చిట్ ఫండ్ అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ అబ్దుల్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి సమావేశమయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వన్ టైమ్ సెటిల్మెంట్ పద్ధతిలో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. బ్యాంకు అధికారులు ఖాతాదారులకు లోక్ ఆదాలత్ పై తెలియజేయాలని తెలిపారు. లోక్ ఆదాలత్ ద్వారా కేసును రాజీ చేయడం ద్వారా సమయాన్ని, డబ్బును ఆదా చేసినవారమవుతామని అన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. లోక్ ఆదాలత్ పై ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న స్థానిక బ్యాంకు అధికారులకు గాని, న్యాయ వాదులను గాని, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను గాని సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మానెన్న, గురురాజ్ కుల్కర్ణి, సంతోష్ సాగర్, బ్యాంకు ప్రతినిధులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది మరియు పారా లీగల్ వాలంటీర్ పాల్గొన్నారు.

# మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
విద్యార్థులు నిత్యజీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురైతే వాటిని అధిగమించడానికి చట్టాలు తొడ్పాడుతాయని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి సూచించారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి నిర్వహించి విద్యార్థులకు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని, పెద్దలను గౌరవించాలని, చక్కగా చదువుకోవాలని, చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాలికల పట్ల, మహిళల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన, వారు కఠిన శిక్షలకు లోనవుతారని తెలియజేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, బాల్య వివాహ నిర్ములన చట్టం, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేసారు. మీ చుట్టు బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా



ఉన్నట్లు గుర్తిస్తే స్కూల్ ప్రిన్సిపాల్ కు నేరుగా గాని,1098 కి ఫోన్ ద్వారా గాని తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రుద్రయ్య స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య మరియు లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదరించండి అభివృద్ధి చేస్తా





**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 06 :**
సంగారెడ్డి జిల్లా :- ఆదరించండి అభివృద్ధి చేస్తానని నారాయణఖేడ్ మండల పరిధిలోని పోతనపల్లి ఎమ్ సర్పంచ్ అవుసలి లావణ్య సమి అన్నారు.శనివారం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనకు ఓటు వేసి గెలిపిస్తే అన్ని రంగాల అభివృద్ధి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా గ్రామంలో రోడ్లు డ్రైనేజీ నీటి సరఫరా పకడ్బందీగా చేస్తానని హామీ ఇచ్చారు.గత పాలనలో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు అభివృద్ధి కోసం ఏమీ చేయలేదని యువకుడునైన తనను గెలిపిస్తే ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధికి అందుబాటులో చెప్పారు.

# నర్సాపూర్ అభివృద్ధికి ఓటెయ్యండి



**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 06 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండల పరిధిలోని నర్సాపూర్ అభివృద్ధికి ఓటెయ్యాలని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి చాకలి సరోజన అంజి అన్నారు. శనివారం ఆమె గ్రామస్థులతో మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ పెద్దల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. గ్రామంలో గత సర్పంచులు చేసిన అభివృద్ధిని చూసి ప్రస్తుతం తనకు అవకాశం ఇయ్యాలని చెప్పారు.


# గుంతమర్పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త రామప్పకు డాక్టర్ చంద్రశేఖర్ నివాళి



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
సంగారెడ్డి జిల్లా ఝరసంఘం మండలం గుంతమర్పల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొత్త రామప్ప మృతి చెందిన వార్త తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రామప్ప సేవలను ఆయన స్మరించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఝరాసంగం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హనుమంతరావు పాటిల్, నాయకులు మోహన్ రెడ్డి, సంగారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి





**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 06 :**
సంగారెడ్డి జిల్లా :- అభివృద్ధికి పట్టం కట్టాలని నారాయణఖేడ్ మండల పరిధిలోని హనుమంతరావుపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి అంబటి తులసి భాయి రాజు అన్నారు. ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ హనుమంతరావుపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా గ్రామంలో వలసలు నివారించడానికి గ్రామంలో కుటీర పరిశ్రమంలో ఏర్పాటు చేసి అన్ని వర్గాల వారికి పని కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.గ్రామంలో రోడ్లు డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు పని చేస్తానన్నారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్



**జహీరాబాద్ వెలుతురు, డిసెంబర్ 06:**
భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ సాధకుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నివాళులర్పణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డా. ఏ. చంద్రశేఖర్ స్థానిక నేతలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ, అంబేద్కర్ అందరికీ సమాన విద్య,ఆరోగ్యం,ఉపాధి, రక్షణ, నివాసం మరియు భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారత పిత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. సమ సమాజనిర్మాణంలో బాబాసాహెబ్ ను ప్రపంచ దేశాలు మరియు ఐక్యరాజ్య సమితి "సింబల్ ఆఫ్ నాలెడ్జ్"గా గుర్తించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కండెం నర్సిములు, మాజీ కౌన్సలర్ లు, యూత్ కాంగ్రెస్ నాయకు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్‌లో ఫిట్ ఇండియా మూవ్మెంట్



**తూప్రాన్, వెలుతురు డిసెంబర్ 6:**
తూప్రాన్ శ్రీ చైతన్య స్కూల్ లో ఫిట్ ఇండియా మూమెంట్ కార్యక్రమాన్ని భవ్యంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా డా. త్రివేని (గైనకాలజిస్టు) విచ్చేశారు. అదేవిధంగా కొంపల్లి జోన్ ఏజీఎం కెఎస్ ఆర్, జివిఆర్ లు ఆరోగ్యంపై విలువైన సూచనలు చేశారు. తరువాత నిర్వహణ బృందం లోని కోఆర్డినేటర్ రవి, అసోసియేట్ కోఆర్డినేటర్ సోమేశ్, ప్రిన్స్ పాల్ రామకృష్ణ రావు, అకాడమిక్ డీన్ అశోక్ రెడ్డి, విద్యార్థులను ఉద్దేశించి ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఫిట్‌నెస్ ప్రమాణం, మాక్ డ్రిల్, వ్యాయామాలు, యోగా, ధ్యానం, ఫిట్‌నెస్ గేమ్స్, ఆరోగ్య చైతన్య ర్యాలీ వంటి వివిధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, శారీరక ధృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించడంలో కీలకపాత్ర పోషించింది. చివరగా, కార్యక్రమానికి విచ్చేసిన డా. త్రివేని మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ బృందానికి, యాజమాన్యం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# సింహాచలంలో మంత్రి అనిత పూజలు

**సింహాచలం,డిసెంబరు6 ( వెలుతురు):**
శ్రీ వరాహలక్ష్మి నరసింహ స్వామివారిని ఏపీ హోం మంత్రి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో హోం మంత్రికి దేవాలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆలయాల పరిరక్షణ, ప్రక్షాళనకు నడుంబిగించినట్లు చెప్పారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించామని, లక్షల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని చెప్పారు. రాబోయే ప్రధాన ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సేవలు శాశ్వత ప్రేరణ

**- అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా జహీరాబాద్‌లో ఘన నివాళులు...**

**- ఎమ్మెల్యే మాణిక్ రావు....**



**జహీరాబాద్ వెలుతురు, డిసెంబర్ 06:**
భారత రాజ్యాంగ ప్రధాన శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ, "అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగమే భారత ప్రజాస్వామ్యానికి అసలు బలం. ప్రతి భారత పౌరుడికీ హక్కులు, సమానత్వం, గౌరవం, అవకాశాలను ఇచ్చిన మహనీయుడి సేవలు సర్వదా చిరస్మరణీయాలు. సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం అన్ని తరాలకు స్ఫూర్తి" అని అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు నేటికీ సమాజ అభివృద్ధికి దారిదిశ చూపుతున్నాయని, యువత ఆయన స్ఫూర్తితో సమానత్వం, సాంఘిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నామ రవికిరణ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మొహియుద్దీన్, యువ నాయకులు మిథున్ రాజ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు శివప్ప, బరూర్ దత్తాత్రి, గణేష్, చంద్రయ్య, అలీ, సలీం, వెంకట్, నరసింహ రెడ్డి, ఇబ్రహీం, జుబేర్, వెంకట్ సాగర్, లక్ష్మీకాంత్, జాకీర్, మోహన్, బి.ఆర్.ఎస్.వి నాయకులు ఫయాజ్, రఘు తేజ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందిగామ గ్రామంలో కాట సుధా ఇంటింటి ప్రచారం.

**- ఉంగరం గుర్తుకు ఓటు వేసి విక్రమ్ గౌడ్ ను గెలిపించండి - కాట సుధాశ్రీనివాస్ గౌడ్.**





**నందిగామ వెలుతురు డిసెంబర్ 06:**
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, పటాన్‌చెరు మండలంలోని నందిగామ గ్రామ సర్పంచ్ అభ్యర్థి విక్రమ్ గౌడ్ కి మద్దతుగా, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఈరోజు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపను సందర్శిస్తూ గ్రామ ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి, కరపత్రాలను అందజేశారు. గ్రామ అభివృద్ధి మరియు సంక్షేమం కోసం సమర్థమైన నాయకత్వం అవసరమని చెబుతూ, తమ అమూల్యమైన ఓటును ఉంగరం ?? గుర్తుపై వేసి అధిక మెజారిటీతో సర్పంచ్ అభ్యర్థి విక్రమ్ గౌడ్ గారిని గెలిపించాలని గ్రామస్థులను కోరారు. ప్రచార కార్యక్రమానికి మహిళలు, యువత మంచి స్పందన ఇవ్వగా, గ్రామంలో ప్రచారం ఉత్సాహభరితంగా కొనసాగింది.

# గాంధీ నెహ్రూలపై దుష్ప్రచారం

**- విషప్రచారం చేసతున్న బిజెపి**

**- మండిపడ్డ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి**



**హైదరాబాద్,డిసెంబరు6 వెలుతురు :**
మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ టార్గెగా బీజేపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూలపై విష ప్రచారం చేయాలని మొదటి నుంచి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గాంధీపై బీజేపీ నాయకులు విషప్రచారం చేస్తుంటే బీజేపీ నేతలపై ప్రజలు తిరగబడుతున్నారని.. దీంతో గాంధీనీ కాకుండా ఇప్పుడు నెహ్రూపై విష ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజల్లోకి బ్యాంక్ సేవలు తీసుకువచ్చిందే ఇందిరాగాంధీ అని గుర్తు చేశారు. చరిత్రను రూపుమాపాలని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'నెహ్రూ కుటుంబం ఎప్పుడూ కుట్రా రాజకీయాలు చేయలేదు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసమే నెహ్రూ కుటుంబం పని చేసిందన్నారు. దేశ ప్రజలు స్వేచ్ఛగా ఉండాలని నెహ్రూ కుటుంబం శాంతియుత పోరాటం చేసి స్వాతంత్ర్యం తీసుకువచ్చారు. స్వాతంత్ర్యం తీసుకువచ్చింది గాంధీనే.. ఇది చరిత్ర.. దీనిని ఎవరూ మార్చలేరు. అప్పుడు బీజేపీ లేదు కదా అందుకే నెహ్రూ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారు. నెహ్రూ ప్రధాని కావాలని స్వాతంత్ర్యం పోరాటం చేయలేదు. నెహ్రూ ప్రధానిగా ఉండాలని ప్రజలు కోరుకున్నారు. ఆయన ప్రధాని అయిన తర్వాత ప్రణాళిక బద్ధంగా ఆర్థిక పురోగతికి ప్రాధాన్యం ఇచ్చారని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. 'లౌకిక వాదాన్ని నెహ్రూ విశ్వసించేవారని.. వారి త్యాగాలను మరిపించడానికి బీజేపీ నేతలు చెడు ప్రచారం చేస్తున్నారు. రాహుల్ గాంధీ కుటుంబంపై కావాలని బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. స్వాతంత్యం÷-ర వచ్చిన తర్వాత ప్రధానిగా దేశంలో నెహ్రూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అప్పుడు ప్రజలు ఏక తీర్మానంతో నెహ్రూను ప్రధానిగా ఉండాలని చెప్పారు. ఇప్పుడు రెండు పర్యాయాలు ఓటింగ్ మిషన్‌లు తమంతట తాము ఓటు వేసుకున్నాయి. అందుకే బీజేపీ అధికారంలోకి వస్తోంది. స్వాతంత్యం÷-ర వచ్చిన రోజుల్లో నెహ్రూ హయాంలో ఆకలి చావులు లేకుండా చేశారు. తాగు, సాగు నీరు ప్రజలకు అందించడం కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులను నెహ్రూ నిర్మించారు' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# అంతిమయాత్ర.. పాల్గొన్న యువ నాయకుడు

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్06 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండల్ వెంకటాపూర్ గ్రామంలో పిడిగి రామ గౌడ్ ఆత్మని శాంతించాలని కోరుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో అంతిమయాత్ర మేకల మల్లొండ పాడి మోయడం జరిగింది కులాలకతీతంగా గ్రామస్తులందరూ పాల్గొనడం జరిగింది.

# బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన గుమ్మడిదల బీఆర్ఎస్ పార్టీ ఉప అధ్యక్షుడు మల్లేష్ గౌడ్



**గుమ్మడిదల వెలుతురు డిసెంబర్ 06:**
గుమ్మడిదల మండల బీఆర్ఎస్ పార్టీ ఉప అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ కాంగ్రెస్ పార్టీలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా పార్టీ లో చేరారు.

# అమెరికా ప్రమాదంలో హైదరాబాద్ యువతి మృతి

**- శోకసంద్రంలో కటుఉంబ సభ్యులు**

**హైదరాబాద్,డిసెంబరు6 ( వెలుతురు):**
అమెరికాలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో తెలుగు యువతి ఉడుముల సహజా రెడ్డి ప్రాణాలు కోల్పోయింది. ఉన్నత చదువుల కోసం నాలుగేళ్ల క్రితం అమెరికా వెళ్లిన ఆమె అనుకోని విధంగా చనిపోయింది. గురువారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల ప్రాంతంలోని గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి, శైలజ భార్యాభర్తలు. జయాకర్ రెడ్డి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శైలజ బచ్చన్నపేట మండలంలో ఎస్జీటీగా పని చేశారు. జయాకర్ కుటుంబం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి సెటిల్ అయింది. జోడిమెట్లలో నివాసం ఉంటోంది. జయాకర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు సహజారెడ్డి 2021లో ఎంఎస్ చదవటం కోసం అమెరికాకు వెళ్లింది. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 13 మంది విద్యార్థులు బర్మింగ్‌హామ్‌లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉంటున్నారు. 13 మందిలో ఉడుముల సహజా రెడ్డి కూడా ఉంది. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకున్న సహజారెడ్డి అక్కడికక్కడే చనిపోయింది. అధికారులు ఆమె మరణ వార్తను జోడిమెట్ల వెంకటాపూర్ రోడ్డులోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటున్న ఆమె తల్లిదండ్రులకు తెలియజేశారు. సహజారెడ్డి మరణ వార్త తెలిసి కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికాలోని భారత ఎంబసీ సహజారెడ్డి మరణంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేసింది. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేసింది. వారితో సంప్రదింపులు జరుపుతోంది. అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది.

# డిప్యూటి సిఎం భట్టితో సినీ ప్రముఖుల భేటీ

**- తెలంగాణ రైజింగ్‌పై చిరు,నాగ్‌లతో చర్చ**



**హైదరాబాద్,డిసెంబరు6 ( వెలుతురు):**
తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో సినీ నటులు చిరంజీవి, నాగార్జునలతో పాటు పలువురు ప్రముఖులు శనివారం ప్రజాభవన్‌లో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై భట్టితో చర్చించారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని వారిని భట్టి విక్రమార్క ఆహ్వానించారు. తప్పకుండా వస్తామని చిరంజీవి, నాగార్జున చెప్పినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో సినీ రంగంపై ప్రత్యేక చర్చ జరగనుంది. సినీ రంగంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో తెలంగాణను మొదటి స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం.. ఈ నెల 9న జరిగే సదస్సులో 'వన్ కంట్రీ - మెనీ సినిమాస్' పేరుతో ప్యానల్ డిస్కషన్స్ చేయాలని నిర్ణయించింది. ఈ చర్చలో ప్రముఖ దర్శకుడు సుకుమార్‌తో పాటు బాలీవుడ్ నటీనటులు జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ దంపతులు, అర్జున్ కపూర్, అనిరుధ్ రాయ్, పార్వతీ గోయెల్, అసిఫ్ అలీ, ప్రియదర్శన్‌లు పాల్గొంటారు. పలువురు నిర్మాతలు, దర్శకులు, ఓటీటీ సంస్థల ప్రతినిధులు, ఇతర సినీ ప్రముఖులు హాజరై తమ అనుభవాలను, అభిప్రాయాలను పంచుకుంటారు. ఫిల్మ్ ఇన్ తెలంగాణ పేరుతో సినిమాల నిర్మాణం, చిత్రీకరణ లొకేషన్లు సహా సదుపాయల కల్పనపై చర్చించనున్నారు. అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్ అనేది ఒక ఎకానిమిక్ సమ్మిట్ అని వివరించారు. ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైసింగ్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ అంత కలిసి కూర్చొని విజన్ డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని సాధించడానికి ఈ విజన్ డాక్యుమెంట్ తయారు చేశామని వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 1:30 నిమిషాలకు తెలంగాణ రైసింగ్ సమ్మిట్ ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్‌లో వివిధ దేశాల నుంచి వచ్చే ప్రముఖ ఎకానమిస్ట్‌లు ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే తనతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం అనేక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సెషన్స్ ఉంటాయని వివరించారు. ఆయా డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన కార్యక్రమాలను మంత్రులు చూసుకుంటారని చెప్పుకొచ్చారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్‌లో అనేక మంది ఎక్స్‌పర్ట్స్ పాల్గొంటారని వివరించారు. 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు క్లోసింగ్ సెర్మనీ ఉంటుందని తెలిపారు. ఈ సెర్మనీలో ఎవరెవరు పాల్గొంటారనే విషయాన్ని ఓ ప్రకటన ద్వారా మళ్లీ తెలియచేస్తామని తెలిపారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 డెలిగేట్స్ వస్తున్నారని వివరించారు. అమెరికా నుంచే 46మంది ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్‌కు తెలుగు రాష్టాల్లోని అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. స్వయంగా అధికారులు వెళ్లి ఆఫీషియల్‌గా పిలుస్తారని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047లో మహిళా శక్తికి జేజేలు

# ప్రధాన ఆకర్షణగా ఇందిరా మహిళా శక్తి స్టాల్







**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ - 2047లో మహిళా సాధికారతకు ప్రతీకగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రజాప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న విధానాలకు ఈ స్టాల్ అద్దం పడుతోంది. మహిళా స్వయం సహాయక సంఘాల శక్తి, సాధికారత, వ్యాపార నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల ముందు సమగ్రంగా ప్రదర్శించే వేదికగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ (సెర్ప్), తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన అనేక వినూత్న కార్యక్రమాల నమూనాలు ప్రదర్శిస్తున్నారు. మహిళలే నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి పెట్రోలు బంకు, హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్, జిల్లాల వ్యాప్తంగా నిర్మితమైన ఇందిరా మహిళా శక్తి భవనాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు, అలాగే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ వంటి విభిన్న వ్యాపారాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు ఈ స్టాల్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామీణ స్థాయి నుంచి గ్లోబల్ వేదిక వరకు మహిళల ప్రయాణాన్ని ప్రతిబింబించేలా



రూపొందించిన డాక్యుమెంటరీలను ప్రదర్శన కోసం ప్రత్యేక స్క్రీన్ లను ఏర్పాటు చేశారు. మహిళా స్వయం సహాయక బృందాలు ఎలా వ్యాపారవేత్తలుగా ఎదిగాయి, ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి ఎలా సుస్థిర ఆదాయ మార్గాలుగా మారింది అనే అంశాలు ఈ డాక్యుమెంటరీల ద్వారా సందర్శకులు




తెలుసుకోగలగుతారు. అలాగే మహిళా - శిశు సంక్షేమం కోసం ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన నూతన కార్యక్రమాల వివరాలను కూడా స్టాల్‌లో సమగ్రంగా ప్రదర్శిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రధాన్యత ఈ స్టాల్‌లో ప్రతిఫలిస్తోంది. వేల కోట్ల రూపాయల బ్యాంకింగ్ లింకేజ్ రుణాల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక బలాన్ని అందించడం, వందల కోట్ల రూపాయల వడ్డీ చెల్లింపులతో మహిళలపై రుణభారాన్ని తగ్గించడం, మహిళా సభ్యులకు రూ.10 లక్షల లోన్ బీమా, రూ.2 లక్షల ప్రమాద బీమా వంటి భద్రతా చర్యలు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలనలో, మంత్రి సీతక్క మార్గదర్శనంలో.. మహిళల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇప్పటికే 20కు పైగా విభిన్న వ్యాపార రంగాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ, మహిళలను యజమానులుగా, నాయకులుగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళుతోంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్%-%2047లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్, మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి అన్న ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలిచి, దేశం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది.

# మహానటి సావిత్రికి మరణం లేదు

- చిత్ర పరిశ్రమలో ఆమె చరిత్ర చిరసస్థాయి
- అలాంటి నటులు నేడు లేరు..రారు
- మంచి సినిమాలు తీస్తే అంతా ఆదరిస్తారు
- సావిత్రి మహోత్సవంలో వెంకయ్యనాయుడు



**హైదరాబాద్,డిసెంబరు6 ( వెలుతురు):**
మహానటి సావిత్రికి మరణం లేదని, ఆమె చరిత్ర అజరామరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. చిత్రపరిశ్రమ ఉన్నంత వరకు ఆమె జీవిస్తూనే ఉంటుందని అన్నారు. 'మహానటి' సావిత్రి 90వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన అనేక విషయాలపై మాట్లాడారు. మహానటిగా ప్రేక్షకాభిమానం సొంతం చేసుకున్న సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తున్నా. 'సావిత్రి మహోత్సవం' అని ఈ కార్యక్రమానికి మంచి పేరు పెట్టారు. సావిత్రి జీవితం నుంచి ఎన్నో విషయాలు నేటితరం నేర్చుకోవచ్చు. నటిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం ఆమె పాటుపడ్డారు. కంటితో కోటి భావాలు, నవరసాలు పలికించే ఆమె నటన అద్భుతం అన్నారు. ప్రస్తుతం అలాంటి నటీమణులు లేరు. ఈ విషయం చెప్పడానికి నాకు ఏ సంకోచం లేదు. నేటి సినిమాల్లో కథానాయికకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. కుటుంబ విలువలు ఉన్న సినిమాలు రావడం లేదు. అభినయం ప్రదర్శించే కథానాయికలను వేళ్ల మీద లెక్క పెట్టి చెప్పవచ్చు. ప్రస్తుతం ఒకరిద్దరు అలాంటి నటీమణులు ఉన్నా, వారికి తగిన అవకాశాలు రావడం లేదు. సినీ ప్రముఖులు ఈ దిశగా ఆలోచించాలని వెంకయ్యనాయుడు సూచించారు. అలాగే మంచి సినిమా తీస్తే తనతో సహా అందరూ ఆదరిస్తారని, ఈ ప్రపంచంలోనే అత్యంత చవకైన వినోదం సినిమా మాత్రమేనని వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు సాహిత్యంలో ఉన్న ఎన్నో కథలను దర్శక-నిర్మాతలు ధారావాహికల రూపంలో నేటి తరానికి అందించాలని కోరారు. ఈటీవీ విన్ 'కథాసుధ' పేరుతో చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సినిమా వ్యాపారమే అయినా, అది కళాత్మకమని నిర్మాతలు గుర్తు పెట్టుకోవాలన్నారు.. 'మహానటి' మూవీని అద్భుతంగా తీశారు. అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్‌కు నా అభినందనలు. ఆ సినిమా చూస్తుంటే పాత రోజులన్నీ గుర్తు వస్తాయి. ప్రతి నిర్మాత ఇలాగే ఆలోచించాలి. మనవైన కథలు ఎన్నో ఉన్నాయి. మంచి సినిమా ఉంటే నాతో సహా అందరూ చూస్తారు. దగ్గుబాటి రానా నిర్మించిన '35: చిన్న కథ కాదు', దిల్‌రాజు కుమార్తె హన్షిత నిర్మించిన 'బలగం', కొణిదెల నిహారిక 'కమిటీ కుర్రాళ్ళు', సుకుమార్ కుమార్తె సుక్రీతి 'గాంధీతాత చెట్టు' ఇలా ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడంతో పాటు, అవార్డులు సొంతం చేసుకున్నాయన్నారు. మన జీవనంలో అత్యంత చౌకగా లభించే వినోదం సినిమా. అప్పటి సినిమాల్లో హీరో-హీరోయిన్ ఒకరినొకరు తాకకుండా శృంగారాన్ని పండించేవారు. ఇప్పుడు తాకిన, గోకినా ఏం జరగడం లేదు. అంత తేడా వచ్చేసింది. సావిత్రిలాంటి నటికి మరణం లేదు. ఆమె మంచితనం కూడా చిర యశస్సు అందించింది. సినిమా వినోదం పాటు, సందేశానికీ ప్రాముఖ్యత ఇవ్వాలి. సందేశాత్మక సినిమాలు ఎవరు చూస్తారని అందరూ అనుకుంటున్నారు. రామోజీరావుగారు తీసిన సందేశాత్మక సినిమాలు ఆడలేదా? నేటి దర్శక-నిర్మాతలు ఆ అభిప్రాయాన్ని మార్చుకుని, కళాత్మక సినిమా తీయాలని కోరుకుంటున్నాఅని వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి తదితర నటులు, సావిత్రి కూతురు విజయచాముండేశ్వరి పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానానికి కృతజ్ఞతలు తెలిపిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

- సమ్మిట్ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించిన మమతా బెనర్జీ



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 06:**
డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు గాను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆహ్వానం అందుకోవడం ఎంతో గౌరవప్రదమైనదని పేర్కొన్నారు. అయితే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న తేదీల్లో తనకు ముందుగానే నిర్ణయించిన జిల్లా పర్యటనలు ఉండటం వల్ల, కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ గ్లోబల్ సమ్మిట్ సార్థక చర్చలకు వేదికగా నిలిచి, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" కార్యక్రమం ఘన విజయం సాధించాలని మమతా బెనర్జీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించే బాధ్యతను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కకు అప్పగించారు. దీనిలో భాగంగా మంత్రి సీతక్క, బెంగాల్ సీఎం మమతా బెనర్జీని సంప్రదించేందుకు ప్రయత్నించారు. అయితే జిల్లాల్లో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల్లో మమతా బెనర్జీ బిజీగా ఉండటంతో, వ్యక్తిగతంగా కలవడం కష్టమని ఆమె ఆదేశాల మేరకు ఆహ్వాన పత్రాన్ని ఇ-మెయిల్ ద్వారా పంపించాలని మమతా బెనర్జీ కార్యాలయం సూచించింది. అనుగుణంగా మమతా బెనర్జీ కార్యాలయంతో సమన్వయం సాధించిన మంత్రి సీతక్క తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అధికారిక ఆహ్వాన పత్రికను ఇ-మెయిల్ ద్వారా పంపించారు. ఆహ్వాన పత్రిక అందుకున్న అనంతరం మమతా బెనర్జీ తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ లేఖ పంపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

# అక్రమ సంబంధాలు, మహిళా హత్య, ఒకరి అరెస్ట్




**తూప్రాన్, వెల్దుర్తి, డిసెంబర్ 6 (వెలుతురు):**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం నెల్లూరు గ్రామ శివారులో మహిళా మృతదేహం లభ్యమైన ఘటన వెనుక అక్రమ సంబంధాల వివాదమే కారణమని దర్యాప్తులో వెల్లడైందని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. ఈ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారనీ డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... దాసరి సత్తయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తాను, భార్య దాసరి నర్సమ్మ (42) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. వారికి వంశీ (21), ప్రశాంత్ (18) అనే ఇద్దరు కుమారులు ఉన్నారని చెప్పారు. డిసెంబర్ 2న సాయంత్రం 7:30 గంటలకు పెద్ద కుమారుడు, భార్య మధ్య వంట విషయం పై తగాదా జరిగినప్పటికీ తరువాత అందరూ భోజనం చేసి నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు నర్సమ్మ ఇంటి నుండి బయటకు వెళ్ళి తిరిగి రాలేదని, గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. డిసెంబర్ 5న సాయంత్రం 4 గంటల సమయంలో, షెరిల్ల గ్రామానికి చెందిన సల్లా మహేష్, సత్తయ్య సోదరుడు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి నెల్లూరు గ్రామ పరిధి బక్క మర్రి వద్ద ఒక మహిళ మృతదేహం కనిపించిందని తెలిపాడు. సమాచారం అందుకున్న సత్తయ్య అక్కడకు వెళ్లగా, అది తన భార్య నర్సమ్మ మృతదేహమని గుర్తించాడు. మృతదేహం కుండెక్కిన స్థితిలో ఉండగా, ముఖం నల్లబడి, పురుగులు పడి, శవం ఒరిగి పడి ఉన్నట్లు, అలాగే గొంతుకు బట్టతో బిగించబడిన దూరం స్పష్టంగా కనిపించిందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. సత్తయ్య తన ఫిర్యాదులో, తమ గ్రామానికి చెందిన దారా మల్లేష్, తమ కొడుకుతో కలిసి భార్య నర్సమ్మతో గత కొన్ని నెలలుగా అక్రమ సంబంధాలు పెట్టుకుని ఉండడమే కాక, ఒకసారి ఇద్దరూ తమ ఇంట్లోనే దొరికిపోయారని, పెద్దలు మందలించినప్పటికీ సంబంధం నిలువలేదని, ఈ నేపథ్యంలో రెండు కుటుంబాల్లో తరచూ గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల తన భార్యను మల్లేష్ హత్య చేసి ఉండొచ్చని తన అనుమానాన్ని వెల్లడించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, తూప్రాన్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంగకృష్ణ, యెల్దుర్తి ఎస్ ఐ రాజు సిబ్బంది కలిసి నిందితుడు దారా మల్లేష్‌ను అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో, డిసెంబర్ 3న మల్లేష్, నర్సమ్మ ఇద్దరూ నెల్లూరు శివారుకు వెళ్లగా అక్కడ అక్రమ సంబంధాల విషయంపై వాగ్వాదం జరిగిందని, పరిస్థితి ఉద్రిక్తమయ్యాక రెండువైపులా గొడవలు కొనసాగుతాయని భావించి, నర్సమ్మ గొంతును నులిమి చంపినట్లు మల్లేష్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం శవాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు అతడు అంగీకరించాడు. నిందితుడు దారా మల్లేష్‌ను పోలీసులు న్యాయపరమైన చర్యల కోసం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో వెల్దుర్తి ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం..

**- ఐదుగురు ఏపీ భక్తుల మృతి**



**అమరావతి,డిసెంబం6( వెలుతురు):**

తమిళనాడులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు ఈ ప్రమాదంలో దుర్మరణం చెందారు. రామనాథపురం జిల్లా సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీకి చెందిన అయ్యప్ప భక్తులు రామేశ్వరం దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రామనాథపురం జిల్లా కీజక్కరై వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఎదురుగా వస్తున్న మరో కారు వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం ప్రకారం, కారులో ఉన్న ఐదుగురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న కీజక్కరై పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతులను విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామ వాసులుగా గుర్తించారు.

# ఏపీలోని పట్టణాలకు రూ. 281కోట్ల నిధులు

**- జీవో జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

**- రెండో విడతగా రూ. 281.89 కోట్ల విడుదల**




**అమరావతి,డిసెంబం6( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు, పది లక్షల లోపు జనాభా ఉన్న (నాన్-మిలియన్ ప్లస్) నగరాలకు రెండో విడత గ్రాంట్‌గా రూ. 281.89 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. ఈ నిధులను ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించనున్నారు. ముఖ్యంగా రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అవసరాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విడుదలైన నిధులను "టైడ్" మరియు "అన్-టైడ్" గ్రాంట్ల రూపంలో కేటాయించారు. ఈ విధానం వల్ల ప్రతి పట్టణం తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను ఖర్చు చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఏయే పనులకు ఎంత మొత్తం కేటాయించాలనేది స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయిస్తారు. ఈ నిధుల విడుదలతో రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పట్టణాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ప్రభుత్వం జీవో జారీ చేయడంతో నిధుల వినియోగానికి మార్గం సుగమమైంది.

# హిల్ట్ పాలసీపై స్టేకు నిరాకరణ

**- హైకోర్టులో ప్రభుత్వానికి ఊరట**

**హైదరాబాద్,డిసెంబర్6( వెలుతురు):**




హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక భూములను ఇతర అవసరాలకు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ (హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ లైఫ్‌స్టైల్ టౌన్‌షిప్) పాలసీపై మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇది కేవలం విధానపరమైన ప్రకటన మాత్రమేనని, ఇంకా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి కోర్టుకు వివరించడంతో ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ప్రభుత్వం నవంబర్ 22న జారీ చేసిన జీవో 27 హెచ్‌ఎండీఏ చట్టానికి, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఉందని ఆరోపిస్తూ ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్యాంకోసీ, జస్టిస్ చలపతిరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్‌రెడ్డి వాదిస్తూ, పారిశ్రామిక భూములను నివాస, వాణిజ్య సముదాయాలకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై స్టే విధించకపోతే ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. హైదరాబాద్‌ను "గ్రీన్ సిటీ"గా మార్చే లక్ష్యంతోనే కాలుష్య పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించేందుకు ఈ పాలసీని తెచ్చామని తెలిపారు. బాలానగర్, కూకట్‌పల్లి, కాటేదాన్ ప్రాంతాల్లో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది కేవలం విధానపరమైన నిర్ణయమని, హెచ్‌ఎండీఏ చట్టం ప్రకారమే ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, మాస్టర్ ప్లాన్‌ను సవరిస్తామని, అందుకు ఇంకా సమయం ఉందని స్పష్టం చేశారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరిస్తూ విచారణను వాయిదా వేసింది.

# సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ!

**- కీలక నిర్ణయం దిశగా తెలంగాణ ప్రభుత్వం!**

**- సాగు లెక్కల కోసం ప్రత్యేక యాప్ అభివృద్ధి**

**హైదరాబాద్,డిసెంబర్6( వెలుతురు):**

వానాకాలం సాగు సమయంలో తెలంగాణలో యూరియా కోసం రైతుల ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బస్తా యూరియా కోసం గంటల కొద్ది కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిల్చున్నారు. యూరియా కొరతపై ఇటు విపక్షాల నుంచే కాక ప్రజలు కూడా ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఇక విపక్షాలు అయితే ప్రభుత్వ అసమర్థత వల్లే కేంద్రం రాష్ట్రానికి సరిపడా యూరియాను సరఫరా చేయలేదని దుమ్మెత్తిపోశాయి. ఈ క్రమంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి యూరియా కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు గాను తెలంగాణ వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకోవడానికి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఈ సారి నుంచి సాగు విస్తీర్ణం ప్రకరమే యూరియా పంపిణీ చేయనున్నారు. అంటే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు అనే వివరాల ఆధారంగానే యూరియా పంపిణీ జరగబోతుంది. దీనికోసం రైతుల పట్టాదారు పాస్‌బుక్కుల నుంచి వివరాలు సేకరించి.. ఎంత యూరియా అవసరమో లెక్కలు తేల్చేందుకు అధికారులు



ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రైతులు తాము సాగు చేసే పొలం విస్తీర్ణం కంటే ఎక్కువ యూరియా తీసుకోకుండా ప్రత్యేక యాప్‌ని అభివృద్ధి చేస్తున్నారు. గత నెల నుంచి ఆధార్ లింకుతో ఈ-పాస్ యంత్రాల ద్వారా యూరియా, ఇతర మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరమో అంతే తీసుకునేలా చర్యలు చేపట్టారు. దీని వల్ల.. అధికారులను తప్పుదోవ పట్టించి బ్లాక్‌లో అమ్మడం కోసం.. ఎక్కువ యూరియా తీసుకుంటే దొరికిపోతారు. దీని వల్ల బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అవసరమని కేంద్రానికి లేఖ రాసింది. ఈ నెలాఖరు వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరింది. అయితే, ఇప్పటివరకు రెండు నెలలకు సంబంధించిన యూరియా నిల్వల్లో సగం మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని వ్యవసాయ శాఖ తెలిపింది. అక్టోబర్‌కు సంబంధించి 37 వేల మెట్రిక్ టన్నులు, నవంబర్ నెలకు సంబంధించిన 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరింది. రాష్ట్రంలో అక్టోబర్ నుండి ఇప్పటివరకు 3.10 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా జరిగింది. ఇప్పటికే మండల వ్యవసాయ శాఖ అధికారులు పంటలు వేసిన రైతులు ఏమేరకు యూరియా వాడకం చేస్తారో పట్టాపాసు బుక్ వివరాలు ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు అధికారులు వివరాల ప్రకారం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశారు. కేంద్రం మిగతా యూరియా కోటాను త్వరగా పంపాలని కోరుతున్నారు.


## వివాహ వయస్సు రాకున్నా

# సహజీవనం చేయొచ్చు..

**- రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు**

**రాజస్థాన్, డిసెంబర్6( వెలుతురు):**

యువతీయువకుల సహజీవనం విషయంలో రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివాహ వయస్సు రాకున్నా సరే యువతీయువకులు మేజర్లయితే పరస్పర ఆమోదంతో సహజీవనం చేయొచ్చని స్పష్టం చేసింది. వివాహ వయస్సు రాలేదన్న కారణంగా రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా హక్కును కాదనలేమని పేర్కొంది. ఈ మేరకు 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడి సహజీవనం కేసులో కోర్టు ఈ తీర్పు వెలువరించింది. యువకుడికి వివాహ వయస్సు రాలేదన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. యువతి కుటుంబ సభ్యుల నుంచి హాని ఉందన్న యువకుడి ఆందోళన నేపథ్యంలో ఆ జంటకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. రాజస్థాన్ హైకోర్టులో 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడు ఓ పిటిషన్ దాఖలు చేశారు. తామిద్దరమూ పరస్పర అంగీకారంతో సహజీవనం చేస్తున్నామని అందులో పేర్కొన్నారు. అయితే, యువతి కుటుంబం దీనిని వ్యతిరేకిస్తూ తమను చంపేస్తామని బెదిరిస్తోందని, తమకు రక్షణ కల్పించాలని యువకుడు




కోర్టుకు విజ్ఞప్తి చేశాడు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ జంట ఆరోపించింది. ఈ జంటలో యువకుడికి వివాహ వయస్సు (21 ఏళ్లు) రాలేదని, సహజీవనం కొనసాగించేందుకు అనుమతి ఇవ్వకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు విన్నవించారు. అయితే పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు కొట్టివేసింది. పెళ్లి వయస్సు రాలేదనే కారణంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన స్వేచ్ఛా హక్కును హరించలేమని పేర్కొంది. భారతీయ చట్టాల ప్రకారం సహజీవనాన్ని నిషేధించలేమని.. దీనిని నేరంగా కూడా చూడలేమని జస్టిస్ అనూప్ ధండ్ స్పష్టం చేశారు.

# పురుషుడిపై మహిళ అత్యాచారం

**- మహారాష్ట్రలో విచిత్ర ఘటన**

**పూణె, డిసెంబర్6( వెలుతురు):**

మహారాష్ట్రలో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ పురుషుడికి మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, తనను పెళ్లి చేసుకోకుంటే రేప్ కేసు పెడతానంటూ ఓ మహిళ బెదిరించిన ఘటన పూణెలోని కోత్రుడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ముంధ్వా ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల వ్యక్తికి, కోత్రుడ్‌కు చెందిన 38 ఏళ్ల మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానని ఆమె నమ్మబలికింది. బాధితుడిపై అతని భార్య పెట్టిన కేసులో న్యాయసహాయం చేస్తానని చెప్పి అతనికి దగ్గరైంది. ఈ క్రమంలో, అతనికి మత్తుమందు ఇచ్చి వేర్వేరు ప్రదేశాలకు తీసుకెళ్లి మూడుసార్లు అత్యాచారం చేసినట్లు బాధితుడు తన ఫిర్యాదులో ఆరోపించాడు. ఆ తర్వాత, నిందితురాలు తనను వివాహం చేసుకోవాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చింది. అతను అందుకు నిరాకరించడంతో, "నన్ను పెళ్లి చేసుకో, లేదా రూ. 2 లక్షలు ఇవ్వు. లేకపోతే నీపై అత్యాచారం కేసు పెట్టి జైలుకు పంపిస్తాను" అని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# తెలంగాణలో మళ్లీ సెంటిమంట

**హైదరాబాద్, డిసెంబర్ 6, ( వెలుతురు)**

తెలంగాణలో రాజకీయాలు మారుతున్నాయి. తెలంగాణ సెంటిమెంటును వాడుకోవాలని, తద్వారా మరో ఐదేళ్లు అధికారంలో ఉండేలా చూసుకోవలని రేవంత్ సర్కార్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. వైఎస్సార్ ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నారు. తర్వాత తెలంగాణ వాదాన్ని అణచివేయాలని చూశారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడం కోసం తెలంగాణ వాదాన్ని పునరుద్ది పెడుతున్నట్లు అనిపిస్తోంది.రాజశేఖరరెడ్డి తెలంగాణ వాదం ప్రారంభించినా.. తర్వాత వ్యతిరేకించాడు. వైఎస్సార్ మరణం తర్వాత ఉద్యమం మరింత ఉధృతమైంది. కేసీఆర్ ఆమరణ దీక్షతో రాష్ట్ర విభజన సాధించాడు. దీంతో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్య పాలన మెరుగుపరుచడంతో హైదరాబాద్ వంటి నగరాల్లో స్థిరత్వం కొనసాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌కు ప్రజలకు మద్దతు లభించిందికాంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలు సాధించినప్పటికీ, పల్లె ప్రాంతాల్లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై చర్చ జరుగుతోంది. పంచాయతీ ఎన్నికల వేళ.. ఇది మరింత ఎక్కువైంది. రైతుబంధు వాయిదా పడటం, హామీల అమలు కాకపోవడంతో ప్రజలు నిలదీస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ వాదంతో అస్థిరత సృష్టించడం కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల తెలంగాణ దిష్టి తగలడంతో కోనసీమ పచ్చదనం కోల్పోతోందని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ ఆలస్యంగా స్పందించింది. ఇప్పుడు దీనిపైనే రాజకీయం చేస్తోంది. తెలంగాణకు పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తోంది. లేదంటే సినిమాలు ఆడనివ్వమని మంత్రి కోమటిరెడ్డి స్వయంగా హెచ్చరించారు. బీఆర్ఎస్ కూడా పవన్ వ్యాఖ్యలను ఖండిచింది. కానీ కాంగ్రెస్ దీనిని రాజకీయం చేస్తోంది. తెలంగాణ – ఆంధ్ర కేఫ్ సెంటిమెంట్ వేడెక్కించడంతో, రాజకీయ వాతావరణంలో మరింత ఉద్రిక్తత ఏర్పడుతోంది.తాజా పరిణామాలతో రెండు రాష్ట్రాల మధ్య శాంతి, అభివృద్ధి వాతావరణంలో ఉద్రిక్తతలకు దారితీయొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.



ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాజకీయాలకన్నా స్థిరత్వం అవసరమని పేర్కొంటున్నారు.

కోమటిరెడ్డిని టార్గెట్ చేసిన ఫ్యాన్స్

పవన్ కళ్యాణ్ కోనసీమ పర్యటన లో తెలంగాణ నాయకులను ఉద్దేశించి చేసిన కామెంట్స్ రాజకీయంగా పెను దుమారమే రేపింది. ఎక్కడ చూసినా ఇప్పుడు దీని గురించే చర్చ. ముందుగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ అంశంపై మాట్లాడారు, విమర్శలు చేశారు, కానీ పెద్ద రేంజ్ కి తీసుకెళ్లింది మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులే. మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తులు పవన్ కళ్యాణ్ పై వరుసగా దాడి చేయడం మొదలు పెట్టారు. ముఖ్యంగా సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి మాట్లాడిన మాటలు పవన్ కళ్యాణ్ అభిమానులను ఒక రేంజ్ లో ట్రిగ్గర్ చేసింది. పవన్ కళ్యాణ్ సినిమాలను ఇక మీదట మా తెలంగాణ లో ఆడనివ్వం, వెంటనే ఆయన క్షమాపణలు చెప్తే ఆలోచిస్తాం, ఇది సినిమాటోగ్రఫీ మినిస్టర్ గా నా మాట అంటూ ఆయన వార్నింగ్ ఇవ్వడం పై పవన్ ఫ్యాన్స్ సోషల్ మీడియా లో రెచ్చిపోయారు.ఇలాంటి బెదిరంపులకు లొంగేవాళ్ళం కాదు, ఇలాంటివి ఆంధ్ర ప్రదేశ్ లో మా నాయకుడు ఎన్నో చూసి ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదా లో కూర్చున్నాడు. మా సినిమాని ఆపేంత దమ్ము ఉంటే ప్రయత్నం చెయ్యి, చూసుకుందాం అంటూ కోమటి రెడ్డి ని ట్విట్టర్ లో ట్యాగ్ చేసి ఒక రేంజ్ లో తిట్టడం మొదలు పెట్టారు. అంతే కాదు గతం లో కోమటి రెడ్డి ఆంధ్ర ప్రజల పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కూడా సోషల్ మీడియా లో అప్లోడ్ చేసి నిలదీస్తున్నారు. ఇలా నాన్ స్టాప్ గా పవన్ ఫ్యాన్స్ నుండి దాడి ఎదురు అవ్వడం తో, కోమటి రెడ్డి సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు తనపై అసభ్య వ్యాఖ్యలు చేసిన కొంతమంది పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ట్విట్టర్ అకౌంట్స్ కి సంబంధించిన లింకులను ఆధారాలతో సహా సీసీఎస్ లో ఫిర్యాదు చేశారట.పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఏ మాత్రం బెదరడం లేదు, పోలీస్ కేసులతో మమ్మల్ని అడ్డుకోలేరు, మా నాయకుడి జోలికి వస్తే ఎంత దూరం వెళ్లడానికైనా సిద్ధం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ వ్యవహారం ఎక్కడ దాకా వెళ్లి ఆగుతుందో చూడాలి. కాంగ్రెస్ పార్టీ నాయకులు అనవసరం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తో పెట్టుకుంటున్నారు అంటూ రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే తెలంగాణ ప్రాంతం లో పవన్ కళ్యాణ్ కి విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉంది. పైగా తెలంగాణాలో జనసేన పార్టీ క్రియాశీలక పాత్రలో లేదు, కాంగ్రెస్ పార్టీ ఓటర్లలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అత్యధిక భాగం ఉంటారు. వాళ్ళ ఓట్లను కోల్పోయిన వాళ్ళు అవుతారు. పవన్ కళ్యాణ్ వీడియో లో అంత స్పష్టంగా తెలంగాణా నాయకులు అని అసంబోదించినా కూడా తెలంగాణ ప్రజలను అన్నట్టు రచ్చ చేయడం కాంగ్రెస్ కి బ్యాక్ ఫైర్ అయ్యే అంశమే అని చెప్పొచ్చు.

# ప్రజల్లో భద్రతాభావం, మనోధైర్యం పెంచేందుకు విస్తృత తనిఖీలు..

**- బస్టాండ్,రద్దీ ప్రాంతాల్లో వాహనాలు, బ్యాగులపై క్షుణ్ణ పరిశీలన.**

**- గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి.**

**గోదావరిఖని డిసెంబర్ 06( వెలుతురు)**

గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో భద్రతా చర్యల్లో భాగంగా బాంబు స్క్వాడ్ సిబ్బంది, శునక దళంతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రజల్లో భద్రతాభావన, మనోధైర్యం పెంచేందుకు ఈ సోదాలు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ వెల్లడించారు. రద్దీగా ఉండే దుకాణ సముదాయాల వద్ద నిలిపి ఉన్న వాహనాలను సిబ్బంది ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు. బస్టాండ్ పరిసరాల్లో కూడా బాంబు స్క్వాడ్ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు ఉన్నాయా అని నిశితంగా పరిశీలించింది. అనుమానం కలిగించిన వస్తువులు, బ్యాగులను శునక దళం సహాయంతో సోదాలు చేసి పరిస్థితిని పూర్తిగా అంచనా వేసింది. ప్రజల భద్రత, శాంతి భద్రత పరిరక్షణ కోసం ఇలాంటి తనిఖీలు తరచుగా కొనసాగుతాయని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. తనిఖీ లలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

https://epaper.velthuru.com

వెలుతురు

# సెట్స్‌లో అడుగుపెట్టిన సమంత.. !!


ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన



నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పుడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో-ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడించింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది. ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది. మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ - గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థ ప్రారంభించి సమంత.. తొలి ప్రయత్నంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ లో రాజ్ నిడిమోరు కూడా భాగం పంచుకున్నాడు. ఇప్పుడు అదే బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' చిత్రం తెరకెక్కుతోంది. దీనికి రాజ్ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 'ఓ బేబి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కలిసి చేస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా 'మా ఇంటి బంగారం' రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సమంత ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.

cinema

# ఆంధ్ర కింగ్ తాలుకా కలెక్షన్స్ జోరు




బాక్స్ ఆఫీస్ దగ్గర లాస్ట్ వీక్ లో మంచి అంచనాల నడుమ రిలీజ్ అయిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన ఆంధ్ర కింగ్ తాలుకా సినిమా మంచి పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా అన్ని చోట్లా జోరు చూపెడుతుంది అనుకున్నా.. కూడా ఓవరాల్ గా ఆ రేంజ్ లో బాక్స్ ఆఫీస్ దగ్గర ఇంపాక్ట్ ని ఏమి చూపించలేక పోతున్న సినిమా మొదటి వీక్ ని ఎలాగోలా కంప్లీట్ చేసుకోగా రెండో వీక్ లో అడుగు పెట్టిన సినిమా మరింతగా డ్రాప్స్ ను అయితే కొనసాగిస్తూ ఉందని చెప్పాలి ఇప్పుడు. ఓవరాల్ గా 8వ రోజున 6 వేలకు పైగా టికెట్ సేల్స్ ను మాత్రమే సొంతం చేసుకున్న సినిమా తెలుగు రాష్ట్రలలో 25 లక్షల రేంజ్ లో షేర్ ని సొంతం చేసుకోగా వరల్డ్ వైడ్ గా 30 లక్షలకు పైగా షేర్ ని 60 లక్షలకు పైగా గ్రాస్ మార్క్ ని సొంతం చేసుకోగా%ౌ% మొత్తం మీద సినిమా 28 కోట్ల రేంజ్ లో వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగగా ఇప్పటి వరకు సాధించిన కలెక్షన్స్ కాకుండా ఇంకా 13.54 కోట్ల రేంజ్ లో షేర్ ని అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక ఈ వీకెండ్ లో సినిమా ఎలాంటి కలెక్షన్స్ ని అందుకుంటుందో చూడాలి.




# ఓటీటీలోకి ధూల్ పేట్ పోలీస్ స్టేషన్

డిజిటల్ రంగంలో 100 శాతం వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతోంది ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహా . ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్ని సూపర్‌హిట్ సినిమాలు, థ్రిల్లింగ్ సస్పెన్స్ వెబ్ సిరీస్?లను సినీ ప్రియులకు అందించింది. అలాగే అన్‌స్టాపబుల్ అంటూ టాక్‌షోలు, తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్ సింగింగ్ షోలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అదిరిపోయే వెబ్ సిరీస్ లను అందించింది ఆహా. ఇక ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. ఆహాలో ఇప్పటికే ఎన్నో రకాల వెబ్ సిరీస్ టాప్ లో దూసుకుపోతున్నాయి. తాజాగా ఓ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ అందుబాటులోకి వచ్చింది. ఆ సిరీస్ మరేదో కాదు ధూల్ పేట్ పోలీస్ స్టేషన్. ఇప్పటికే ఈ సిరీస్ నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ సిరీస్ పై అభిమానుల్లో ఆసక్తి పెంచేశాయి. నేటి నుంచి ఈ సిరీస్ ప్రేక్షకులకు ఆహాలో అందుబాటులోకి వచ్చింది. ఇంట్రెస్టింగ్ స్టోరీతో ఈ సిరీస్ తెరకెక్కిందని అంటున్నారు. తమిళ యాక్టర్స్ అశ్విన్, శ్రీతు కృష్ణన్, గురు ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ కు జస్విని దర్శకత్వం వహించారు. ఆసక్తికరమైన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సిరీస్.. ఈ శుక్రవారం( నేటి నుంచి) తెలుగు, తమిళంలో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. అలానే ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు కొత్త ఎపిసోడ్ రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో నేడు ( శుక్రవారం) ఓ ఎపిసోడ్ ను రిలీజ్ చేశారు. ఇక ధూల్ పేట్ అనే ఊరిలో ఓ రోజు రాత్రి మూడు హత్యలు జరుగుతాయి. వీటిని దర్యాప్తు చేసేందుకు ఓ ఏసీపీని అపాయింట్ చేస్తారు. అతను నేరస్థులను పట్టుకోలేకపోతాడు. దీంతో మరో ఏసీపీని కూడా కేసుని దర్యాప్తు చేసేందుకు నియమిస్తారు. తర్వాత ఏమైంది? అసలు ఆ హత్యలు చేసింది ఎవరు.? ఎందుకు అనేది సిరీస్ లో చూడాల్సిందే..

# మన శంకర వరప్రసాద్ గారు మూవీ నుంచి సెకండ్ సింగిల్ సాంగ్.....

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 6 :** మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్ గా మన శంకర వరప్రసాద్ గారు సినిమా వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఆ మూవీ సంక్రాంతి కానుక విడుదల అవ్వనుంది. కొన్ని రోజుల క్రితం రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల ' వ్యూస్ రెస్పాన్స్ అందుకుంది. మీసాల పిల్ల పాటకు వచ్చిన రెస్పాన్స్తో ఫుల్ జోష్ తో 'మన శంకర వరప్రసాద్ గార' మేకర్స్ ఇప్పుడు సినిమా నుంచి సెకండ్ సింగిల్ " శశిరేఖ" అంటూ సాగునున్న మెలోడీ పాటను విడుదల చేసినందుకు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 8 వ సాంగ్ రిలీజ్ కానుండగా తాజాగా సోషల్ మీడియాలో ప్రోమో విడుదల చేశారు. ప్రస్తుతం నెట్టింట ప్రోమో అందరినీ ఆకట్టుకుంటూ దూసుకుపోతుంది. అయితే సాంగ్లో చిరంజీవి ట్రెడిషనల్ వేర్లో అదిరిపోయేలా ఉన్నారని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన శశిరేఖ సాంగ్ ప్రోమో ఇప్పుడు మంచి బజ్ క్రియేట్ చేస్తుంది పూర్తి పాట కోసం ఈగరుగా వెయిట్ చేస్తున్న ప్రేక్షకులు. అయితే మరో రెండు రోజుల్లో ఫుల్ సాంగ్ విడుదలవుతుంది మన శశిరేఖ పాట ఎలా ఉంటుందో ఎంతలో ఆకట్టుకుంటుందో ఎన్ని రకాలు వెయిట్ చేస్తుందో వేచి చూడాలి.




# ధనుష్ 100 కోట్ల మార్క్




బాక్స్ ఆఫీస్ దగ్గర హిందీలో చాలా టైం తర్వాత మంచి బజ్ తో వచ్చిన కోలివుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన హిందీ సినిమా తేరే ఇష్క్ మే సినిమా డీసెంట్ రివ్యూలను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా మంచి జోరుని చూపెడుతూ ఉండగా సినిమా ఓవరాల్ గా.. వర్కింగ్ డేస్ లో కూడా మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండగా 5 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 69.35 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకోగా 6వ రోజున వర్కింగ్ డే లో మరోసారి ఎక్స్ లెంట్ గా హోల్డ్ ని చూపించిన సినిమా%ౌ%6.89 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకుంది%ౌ%ఇక టోటల్ గా 6 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 76.24 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా డబ్ వర్షన్స్ తో కలిపి సినిమా 79.75 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా%ౌ%ఇండియాలో గ్రాస్ 93 కోట్ల రేంజ్ లో సొంతం చేసుకుంది. ఇక సినిమా ఓవర్సీస్ లో 1 మిలియన్ రేంజ్ లో వసూళ్ళని అందుకోగా ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఇప్పుడు 6 రోజుల్లో సాధించిన కలెక్షన్స్ తో 100 కోట్ల మార్క్ ని దాటేసి మాస్ రచ్చ చేయడం విశేషం. ధనుష్ కెరీర్ లో హిందీ లో ఇవి సెన్సేషనల్ కలెక్షన్స్ అని చెప్పాలి. ఓవరాల్ గా ఎక్స్ లెంట్ కలెక్షన్స్ తో కుమ్మేస్తున్న సినిమా హిందీ లో లాంగ్ రన్ లో 100 కోట్ల నెట్ కలెక్షన్స్ మార్క్ వైపు పరుగులు పెడుతూ ఉండటం విశేషం అని చెప్పాలి. ఇక సినిమా 7వ రోజున మరోసారి మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండటంతో మరోసారి 6 కోట్ల రేంజ్ కి అటూ ఇటూగా నెట్ కలెక్షన్స్ ని అందుకునే అవకాశం ఉండగా లాంగ్ రన్ లో సినిమా ఏ రేంజ్ లో మాస్ రచ్చ చేస్తుందో చూడాలి ఇప్పుడు.

# థియేటర్లకు తీసుకురావడానికి మా వంతు ప్రయత్నం చేశాం

టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన అంశం అఖండ 2 విడుదల వాయిదా. మరికొన్ని గంటల్లో సినిమా థియేటర్లలోకి విడుదల కాబోతుండగా వాయిదా పడటం అందరికీ షాక్ ఇచ్చింది. నందమూరి అభిమానులు దీనిపై తీవ్రమైన అసంతృప్తిని సోషల్ మీడియాలో వ్యక్తం చేస్తున్నారు. 'ఇంత పెద్ద ప్రాజెక్ట్.. ఇంత పెద్ద స్టార్ హీరో సినిమా..




ఎలాంటి ప్లానింగ్ లేకుండా ఇలాంటి తప్పులు ఎలా జరుగుతాయి?'అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో అఖండ 2 నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ కీలక ప్రకటన చేసింది. బాలకృష్ణ-బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'అఖండ తాండవం' కోసం తెలుగు ప్రేక్షకులతో పాటు నార్త్ ఇండియా ఆడియన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంయుక్త మీనన్ హీరోయిన్‌గా, ఆది పినిశెట్టి విలన్‌గా నటించిన ఈ సినిమా డిసెంబర్ 4న ప్రీమియర్ షోలతో ప్రారంభమై, డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సింది. అయితే విడుదలకు కొన్ని గంటల ముందు అనుకోని పరిణామాలు చోటుచేసుకోవడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అభిమానుల అంచనాలు, థియేటర్లలో ఏర్పాట్లు, బుకింగ్స్ అన్ని సిద్ధంగా ఉన్నా చివరి నిమిషంలో రిలీజ్‌పై సందిగ్ధత నెలకొనడంతో అందరూ నిరాశ చెందారు. అఖండ 2 తాండవం నిర్మించిన 14 రీల్స్ ప్లస్ సంస్థకు, హీరోస్ ఇంటర్నేషనల్ అనే సంస్థకు మధ్య ఉన్న పాత ఆర్థిక ఒప్పందాలు ప్రధాన వివాదంగా మారాయి. ఈ ఫైనాన్షియల్ అగ్రిమెంట్లపై తొలుత అంతర్గత చర్చలు జరిగినా, వివాదం పరిష్కారం కాకపోవడంతో హీరోస్ ఇంటర్నేషనల్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో కోర్టు సినిమా విడుదలపై స్టే విధించగా, ఇప్పటికే సిద్ధమైన దేశవ్యాప్తంగా ఉన్న షోలు, ఓవర్సీస్ స్క్రీనింగ్స్ అన్నీ నిలిచిపోయాయి. ఇండస్ట్రీ పరంగా, ప్రేక్షకులపరంగా ఇది చాలా అరుదుగా జరిగే పరిస్థితి. ముఖ్యంగా బాలకృష్ణలాంటి అగ్ర హీరో సినిమా పూర్తి స్థాయిలో ఆగిపోవడం ఇండస్ట్రీలో పెద్ద చర్చగా మారింది. అఖండ 2 విడుదలపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. 'అఖండ 2ని థియేటర్లకు తీసుకురావడానికి మా వంతు ప్రయత్నం చేశాం. కానీ కొన్నిసార్లు ఊహించని పరిస్థితులు ఎదురవుతాయి. అందువల్ల సినిమా ఈరోజు విడుదల చేయడం సాధ్యం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఈ పరిస్థితుల్లో కూడా మాకు తోడుగా నిలిచిన బాలకృష్ణ గారికి, దర్శకుడు బోయపాటి శ్రీనుకు కృతజ్ఞతలు. అఖండ 2 ఎప్పుడెప్పుడు వచ్చినా బ్లాక్‌బస్టర్ అవడం ఖాయం. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం" అని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అఖండ 2 మేకర్స్ సోషల్ మీడియాలో ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన రావడంతో అభిమానుల్లో మరోసారి కన్ఫ్యూజన్ మొదలైంది. ఈ పరిణామాలతో బాలయ్య అభిమానుల్లో తీవ్ర అసహనం నెలకొంది. సినిమా విడుదల వాయిదా పడటంతో వారికి తీవ్ర నిరాశను కలిగించింది. సోషల్ మీడియాలో నిర్మాతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి కొత్త రిలీజ్ డేట్‌పై ఉంది. అఖండ 2 ఇప్పటికే ఎన్నోసారి వాయిదా పడటంతో అభిమానుల్లో నిరాశ నెలకొంది. అఖండ 2 సినిమా ఎప్పుడు విడుదల అవుతుంది? చాలా మంది భావిస్తున్నట్లుగా ఈ సినిమా సంక్రాంతి రేసులోకి తీసుకువస్తారా? లేక మరింత ఆలస్యం చేస్తారా? అన్నది త్వరలోనే తెలుస్తుంది.

# ఉగ్రవాదుల చెరలో భువనగిరి యువకుడు

**- ఆఫ్రికాలోని మాలిలో ఘటన**

**హైదరాబాద్,డిసెంబర్6( వెలుతురు):**
ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశానికి వెళ్లిన యాదాద్రి భువనగిరి జిల్లా యువకుడు ప్రవీణ్ ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్నాడు. గత నెల 23న విధులు ముగించుకుని వస్తుండగా JNIM ఉగ్రవాద సంస్థకు చెందిన దుండగులు కిడ్నాప్ చేశారు. దీంతో అతడి తల్లిదండ్రులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారత ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.ఉపాధి కోసం జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టిన ఊరును వదిలి విదేశాలకు వెళ్లిన ఓ యువకుడు ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బండసోమారం గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడిని ఆఫ్రికాలో ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర ఆందోళనను సృష్టించింది. తమ బిడ్డ ఎలా ఉన్నాడోనని తల్లి మహేశ్వరి, తండ్రి జంగయ్య తల్లడిల్లుతున్నారు.వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన నల్లమాస జంగయ్య, మహేశ్వరి దంపతుల రెండో కుమారుడు ప్రవీణ్ ఉపాధి కోసం గతేడాది నవంబరులో ఒక బోర్‌వెల్ కంపెనీ తరఫున ఆఫ్రికాలోని మాలి దేశంలోని కోబ్రి ప్రాంతానికి వెళ్లారు. ఎంత పనిలో ఉన్నా.. ప్రవీణ్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల సమయంలో తప్పనిసరిగా తల్లిదండ్రులతో మాట్లాడేవాడు. అయితే గత నెల 22న చివరిసారిగా ఇంటికి కాల్ చేసిన ప్రవీణ్.. మరుసటి రోజు నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.ప్రవీణ్ కిడ్నాప్ అయిన విషయాన్ని బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు డిసెంబర్ 4 అతని తల్లిదండ్రులకు ఫోన్ చేసి ధ్రువీకరించారు. గత నెల 23న ప్రవీణ్ విధులు ముగించుకుని తాను ఉంటున్న గది వద్దకు వెళ్తుండగా.. జేఎన్ఐఎం (JNIM) అనే ఉగ్రవాద సంస్థకు చెందిన దుండగులు అతడిని కిడ్నాప్ చేశారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అంతకుముందు కూడా అదే ప్రాంతంలో ఆ సంస్థ కొంతమంది విదేశీయులను కిడ్నాప్ చేసినట్లు సమాచారం. ఈ ఘటన గురించి తెలుసుకున్న



బండసోమారం గ్రామ ప్రజలు, ప్రవీణ్ కుటుంబ సభ్యులకు కన్నీటి పర్యంతమవుతున్నారు. అతని క్షేమం గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుతం ప్రవీణ్ ఆచూకీ కోసం బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు ఢిల్లీలోని భారత రాయబార కార్యాలయం అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రవీణ్‌ను సురక్షితంగా విడిపించేందుకు భారత ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ విజ్ఞప్తి చేస్తున్నారు. విదేశీ గడ్డపై ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్న తమ బిడ్డను త్వరగా స్వదేశానికి తీసుకురావాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. మాలిలో ఉగ్రవాదం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో.. ప్రవీణ్ త్వరగా క్షేమంగా తిరిగి వస్తాడనే ఆశతో బండసోమారం గ్రామం మొత్తం ఎదురుచూస్తోంది.

# విమానాల రద్దుపై సుప్రీంలో పిటిషన్

**- మానవతా సంక్షోభం నెలకొందని పిల్**

**- తక్షణమే జోక్యం చేసుకోవాలని కోర్టుకు అభ్యర్థన**



**న్యూఢిల్లీ,డిసెంబర్6( వెలుతురు):**
ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో నెలకొన్న సంక్షోభంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత కొన్ని రోజులుగా 1,000కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో తక్షణమే న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ఇండిగో ఆల్ ప్యాసింజర్ అండ్ అనదర్' పేరుతో న్యాయవాది నరేంద్ర మిశ్రా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. విమానాల రద్దు, తీవ్ర జాప్యం కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో 'మానవతా సంక్షోభం' తలెత్తిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వృద్ధులు, పసిపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారితో సహా వేలాది మంది ప్రయాణికులు ఆహారం, నీరు, విశ్రాంతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పౌరుల జీవించే హక్కు (ఆర్టికల్ 21)కు తీవ్ర విఘాతం కలిగించడమేనని తెలిపారు. పైలట్ల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన విమాన డ్యూటీ సమయ పరిమితి నిబంధనల అమలులో ప్రణాళిక లోపం వల్లే ఈ అంతరాయాలు ఏర్పడ్డాయని ఇండిగో బహిరంగంగా అంగీకరించింది. అయితే, ఈ మార్పులను ముందుగా అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడంలో ఇండిగోతో పాటు డీజీసీఏ కూడా విఫలమయ్యాయని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కీలక మార్గాల్లో టికెట్ ధరలను రూ.50,000 వరకు పెంచి ప్రయాణికులను బందీలుగా మార్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విమానాల రద్దు వల్ల చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఇతర విమానాల్లో లేదా రైళ్లలో ఉచితంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా ఇండిగోను ఆదేశించాలని అభ్యర్థించారు. అలాగే డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమగ్ర నివేదిక సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు.

# పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి భవన్ విందు

**- హాజరైన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్**

**న్యూఢిల్లీ,డిసెంబర్6( వెలుతురు):**
రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం నిన్న రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన విందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ హాజరుకావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. ఇదే కార్యక్రమానికి లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆహ్వానం అందకపోవడం ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది. ఈ పరిణామాలపై ఎన్డీటీవీతో మాట్లాడిన శశి థరూర్, తాను విందుకు ఎందుకు హాజరయ్యారో స్పష్టతనిచ్చారు. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా తన విధి నిర్వహణలో భాగంగానే తాను వచ్చానని తెలిపారు. "విదేశాలతో సంబంధాలు నెరపడం మా కమిటీ పరిధిలోని అంశం. ఆయా దేశాలతో చర్చల్లో ఏం జరుగుతుందో, అక్కడి వాతావరణం ఎలా ఉంటుందో తెలుసుకోవడం చాలా ఉపయోగపడుతుంది. అందుకే ఇక్కడికి వచ్చాను. అంతకుమించి ఇందులో మరేమీ లేదు" అని ఆయన వివరించారు. విందుకు తనను ఆహ్వానించడాన్ని తాను గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.



ప్రభుత్వంతో కలిసి పనిచేయడంపై థరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో కొన్ని విషయాల్లో విభేదించినా, మరికొన్నింటిలో ఏకీభవిస్తూ ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలి" అని ఆయన అన్నారు. ఇటీవల ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడుతున్న నేపథ్యంలో పార్టీ మారే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఆయన ఆచితూచి స్పందించారు. "నేను కాంగ్రెస్ పార్టీ ఎంపీని. ఎన్నికల్లో గెలవడానికి చాలా కష్టపడ్డాను. వేరే నిర్ణయం తీసుకోవాలంటే చాలా విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. తన నియోజకవర్గ ప్రజల కోసం పనిచేయడమే తన ప్రధాన బాధ్యత అని థరూర్ స్పష్టం చేశారు.

## ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా విక్రమ్ పూల

**అమరావతి,డిసెంబం6( వెలుతురు):**
మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం నూతన అధ్యక్షుడిగా పి. త్రివిక్రమరావు (విక్రమ్ పూల) నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నియామకంతో పాటు అధికార భాషా సంఘం నిర్వర్తించాల్సిన కీలక బాధ్యతలను, కార్యాచరణను కూడా ప్రభుత్వం స్పష్టంగా నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ఆంగ్ల భాష వాడకాన్ని నియంత్రించి, తెలుగు వినియోగాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో తెలుగు వాడకం ఏ స్థాయిలో ఉందో తనిఖీలు చేసే అధికారాన్ని సంఘానికి కల్పించింది. తనిఖీల అనంతరం సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొంది. తెలుగు భాష వినియోగంలో సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అధికార భాషాభివృద్ధికి అవసరమైన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని కూడా ప్రభుత్వ ఉత్తర్వుల్లో వివరించింది.

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నితీశ్ కుమార్



**పాట్నా, డిసెంబర్6( వెలుతురు):**
బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో, ఆయన పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి, తమ జాబితాలో చేర్చింది. ఈ మేరకు సదరు సంస్థ నితీశ్ కుమార్‌కు ప్రత్యేకంగా అభినందన లేఖను పంపింది. ఒకే వ్యక్తి ఒక రాష్ట్రాన్ని పదిసార్లు పాలించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అరుదైన ఘనత అని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన లేఖలో పేర్కొంది. "1947 నుంచి 2025 మధ్య కాలంలో పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తొలి వ్యక్తిగా నిలవడం భారతదేశానికి గర్వకారణం. ఇది మీ అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. బీహార్ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసానికి ఈ అసాధారణ విజయం తార్కాణం" అని ప్రశంసించింది. సుపరిపాలన, అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నితీశ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆ సంస్థ కొనియాడింది. ఆయన నాయకత్వ పటిమ వల్లే పదేపదే ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించింది. ఈ అరుదైన గౌరవం దక్కడంతో నితీశ్ కుమార్‌కు పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు

**- నేషనల్ హెరాల్డ్ కేసులో దర్యాప్తు**



**న్యూఢిల్లీ,డిసెంబర్6( వెలుతురు):**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నేషనల్ హెరాల్డ్ కేసులో మరోసారి ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. కేసులోని కొన్ని ఆర్థిక విషయాలు, లావాదేవీలపై వివరణ ఇవ్వాలని నోటీసులో కోరారు. విచారణకు హాజరు కావాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు చాలాకాలంగా నడుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు విచారణ ఎదుర్కొన్నారు. ఇదే కేసులో భాగంగా గతంలో కూడా డీకే శివకుమార్‌ను ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు ప్రశ్నించాయి. తాజాగా ఆర్థిక నేరాల విభాగం పోలీసులు పంపిన నోటీసులతో ఈ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. కేసు విచారణలో భాగంగా కొన్ని కీలకమైన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి డీకే శివకుమార్ నుంచి సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నోటీసులపై శివకుమార్ ఎలా స్పందిస్తారు, విచారణకు ఎప్పుడు హాజరవుతారనేది ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామం కర్ణాటక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com